అమ్మ పండగ.. అఖిలం నిండుగ

- నేటి నుంచి దసరా వేడుకలు ఆరంభం
- తొలిరోజు ఉదయం 9గంటల నుంచి దర్శనాలు

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా నేటి నుంచి ఆరంభం కానున్నాయి. మొదటి రోజు నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకోనున్నారు. ఇంద్రకీలాద్రి కొండ దిగువన వినాయక ఆలయం వద్ద నుంచి క్యూలైన్లను వేశారు. భక్తులు ఒకసారి క్యూలైన్లలోకి ప్రవేశించాక.. రెండు కిలోమీటర్ల దూరం నడిచి వచ్చి ఘాట్‌రోడ్డు మీదుగా వెళ్లి అమ్మవారిని దర్శించుకోనున్నారు. అనంతరం శివాలయం మెట్ల మార్గానికి పక్కనే ఏర్పాటు చేసిన తాత్కాలిక మార్గం, మహామండపంలో ర్యాంప్, మెట్ల మార్గం ద్వారా భక్తులు కిందకు దిగనున్నారు. సరిగ్గా భక్తులు కిందకు దిగే ప్రాంతంలోనే అన్నదాన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అన్నప్రసాదం స్వీకరించిన తర్వాత.. పక్కనే కనకదుర్గానగర్‌లో లడ్డూ ప్రసాదం కౌంటర్లను ఏర్పాటు చేశారు. గురువారం నుంచి ఆరంభమయ్యే దసరా వేడుకలు.. ఈనెల 12 వరకూ జరగనున్నాయి. దసరా తొమ్మిది రోజుల్లో.. అమ్మవారు తొమ్మిది రూపాల్లో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.


ఉత్సవాలకు ముస్తాబైన ఇంద్రకీలాద్రి

దర్శనాల సమయాలు...

ప్రతిరోజు ఉదయం 4 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకూ భక్తులను అమ్మవారి దర్శనాలకు అనుమతిస్తారు. తొలిరోజు మాత్రం ఉదయం 9 గంటల తర్వాత నుంచి దర్శనాలు ఆరంభమవుతాయి. ఈసారి దసరా వేడుకలు జరిగే తొమ్మిది రోజులు, అనంతరం ఈనెల 13, 14 వరకూ అంతరాలయం దర్శనాలు పూర్తిగా ఆపేస్తున్నట్లు ప్రకటించారు. ముఖమండప దర్శనాలకు మాత్రమే అనుమతిస్తారు. ప్రతి రోజు సాయంత్రం 6.30 నుంచి 7.30 వరకు అమ్మవారి మహా నివేదన, పంచహారతులు నిర్వహిస్తారు. ఆ సమయంలో భక్తుల దర్శనాలను గంట సమయం పూర్తిగా ఆపేస్తారు.



- దుస్థితిలో వ్యసన విమోచన కేంద్రం
- జీతాలివ్వక నిర్వీర్యం చేసిన గత వైకాపా ప్రభుత్వం

వైద్యుడు లేరు.. మందుల్లేవ్!

ఈనాడు-అమరావతి

గుంటూరు ప్రభుత్వ బోధనాసుపత్రిలోని వ్యసన విమోచన కేంద్రాన్ని (డీ అడిక్షన్ సెంటర్) గత వైకాపా ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. వైద్యులు, కౌన్సెలర్లకు జీతాలు చెల్లించలేదు. ఓ కన్సల్టెంట్ వైద్యుడికైతే 11 నెలలపాటు ఇవ్వకుండా సేవలు చేయించుకుంది. విసిగిపోయిన ఆయన మూడు నెలల క్రితం వెళ్లిపోయారు. ముగ్గురు కౌన్సెలర్లు, ఇద్దరు నర్సులు, ఇద్దరు వార్డు సిబ్బంది, ఒక డేటా ఎంటీ ఆపరేటర్‌కు గత 11 నెలల నుంచి జీతాలు రావడం లేదు. ఏదో ఒకరోజు వేతనం రాకపోతుందా అన్న ఆశతోనే వారు విధులకు హాజరవుతున్నారు. ప్రస్తుతం కన్సల్టెంట్ డాక్టర్ లేరు.

గంజాయి, మద్యం, ఇతర మత్తు పదార్థాలకు బానిసలవుతున్నవారిలో మార్పు తీసుకురావడంతో ఈ కేంద్రం కీలకంగా ఉండేది. గత ప్రభుత్వ హయాంలో గంజాయి, ఇతర మత్తుపదార్థాల విక్రయాలు ఏ స్థాయిలో ఉండేవో తెలిసిందే. బాధితులకు మానసిక వ్యాధుల విభాగంలోనే వైద్యులు చికిత్స అందించేవారు. గత ఐదేళ్ల కాలంలో బాధితులు విపరీతంగా పెరగడంతో ప్రత్యేకంగా ఒక వైద్యుడు, ఎనిమిదిమంది సిబ్బందితో వ్యసన విమోచన కేంద్రాన్ని ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. ఇక్కడ నిత్యం 20 నుంచి 25 మందిదాకా ఓపీకి వస్తుండేవారు. ఐదారుగురిని ఇన్‌పేషెంట్లుగా చేర్చుకోవాల్సి వస్తోంది.

★ ఔషధాల్లేక రోగులు వెళ్లిపోతున్నారు. గతంలో 15 రోజులకు సరిపడా మందులు ఇచ్చేవారమని, ప్రస్తుతం నాలుగైదు రోజులకు మించి ఇవ్వడం లేదని సిబ్బంది చెప్పారు. మందుల కొరతను ఆసుపత్రి ఉన్నతాధికారులు ఇటీవల కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ దృష్టికి తీసుకెళ్లారు.

రెండేళ్లుగా ఔషధాలకు కటకటే

రెండేళ్ల నుంచి ఔషధాల పంపిణీ అంతంతమాత్రంగానే ఉంది. ఉన్నవే ఇవ్వడం తప్ప పూర్తిస్థాయిలో సరఫరా లేదు. వ్యవసనపరులకు అవసరమైనవాటిని ఆరు నెలలకు సరిపడేలా టెండర్ల ద్వారా ముందుగానే సమకూర్చుకోవాలి. గత వైకాపా ప్రభుత్వం ఆ పని చేయలేదు. గత ఏడెనిమిది మాసాలుగా మందుల కొరత తీవ్రంగా ఉందని రోగులు వాపోతున్నారు. పూర్తిస్థాయిలో వాడకపోవడం వల్ల రోగుల్లో కొంతమంది తిరిగి మత్తుకు బానిసలుగా మారిపోతున్నారని వైద్యులు చెబుతున్నారు.

మిర్చితో ఏమార్చి..!

అడ్డదిడ్డంగా జీడీసీసీబీ రుణాలు

గడువు దాటినా వసూలు కాని బకాయిలు


ఉమ్మడి జిల్లాలో శీతల గోదాముల్లో మిర్చి నిల్వ చేసిన రైతులకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (జీడీసీసీబీ) ఇచ్చిన రుణాలు
రూ.164 కోట్లు

ఇందులో ఒక్క నల్లపాడు శాఖ ఇచ్చిన మొత్తం...
రూ.116 కోట్లు

జిల్లావ్యాప్తంగా జీడీసీసీబీకి పేరుకుపోయిన బకాయిలు...
రూ.53 కోట్లు

ఒక్క నల్లపాడు శాఖ పరిధిలోని బకాయిలే ఏకంగా
రూ.40 కోట్లు

ఈనాడు - అమరావతి



శీతల గోదాముల్లో నిల్వ చేసిన మిర్చికి బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు సకాలంలో వసూలు కావడం లేదు. పైగా తనఖా పెట్టిన మిర్చి బస్తాలు మాయం కావడంతో ఆ బకాయి వసూలు చేయడం బ్యాంకర్లకు తలకుమించిన భారమవుతోంది. ఇందులో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు వాటా ఎక్కువగా ఉండడం గమనార్హం. గోదాముల యజమానుల్లో కొందరు నకిలీ బాండ్లు సృష్టించి వారికి తెలిసిన వ్యక్తులను రైతులుగా చూపించి రుణాలు పొంది సొంతానికి వాడుకున్నారు. మిర్చి నిల్వ చేసి తీసుకున్న రుణాలకు ఏడాది కాల వ్యవధి ఉంటుంది. ఈ గడువు ముగిసినా బకాయిలు వసూలుకాని పక్షంలో మిర్చిని వేలం వేసి సొమ్ము రాబట్టుకునే అవకాశం బ్యాంకర్లకు ఉంది. అయితే మిర్చి నిల్వలు బ్యాంకుకు తెలియకుండా అమ్ముకోవడం, మరో బ్యాంకుకు ఆ నిల్వలు చూపించి రుణాలు తీసుకోవడంతో వాటిని వేలం వేసే పరిస్థితి ఉండడం లేదు.

జీడీసీసీబీ నల్లపాడు బ్రాంచి ఇచ్చిన రూ. 116 కోట్ల రుణాల్లో మూడు నెలల వ్యవధిలో ఇచ్చినవే ఎక్కువగా ఉన్నాయి. ఈ శాఖ పరిధిలో రూ. 25 కోట్లకు సంబంధించి ఇప్పటికే ఏడాది గడువు పూర్తయింది. మరో రూ. 15 కోట్లకు ఏడాది గడువు పూర్తికావడానికి కొన్ని రోజుల సమయం ఉంది. బకాయిలు వసూలుకాని పక్షంలో మిర్చిని వేలం వేయాలని ఉన్నతాధికారులు చెబుతున్నా.. ఆ దిశగా అడుగులు పడడం లేదు. రాఘవేంద్ర శీతలగోదాములో నకిలీ బాండ్లు పెట్టి రుణాలు పొందారు. ఇందులో నల్లపాడు బ్రాంచికు రూ. 4 కోట్ల బకాయి వసూలు కావాల్సి ఉంది. గోదాములోని మిర్చిలో కొంత ఇప్పటికే విక్రయించడం, మరో బ్యాంకులోనూ బాండ్లుపెట్టి రుణాలు పొందినందున జీడీసీసీబీకి చూపిన బస్తాలు ఉన్నాయా? లేవా? అన్నది విచారణలో తేలాల్సి ఉంది.

కొరవడిన పర్యవేక్షణ

నల్లపాడు బ్రాంచి పరిధిలో ఒక్కో రైతు పేరుమీద గరిష్ఠంగా రూ. 10 లక్షల రుణమిచ్చారు. ఇంత పెద్దమొత్తంలో ఇచ్చినప్పుడు క్షేత్రస్థాయిలో అంతా పక్కాగా ఉందా? లేదా? అన్నది బ్యాంకు ఉన్నతాధికారులు తనిఖీ చేసి ఉంటే నిబంధనలు పక్కాగా అమలయ్యేవి. బ్యాంకు విశ్రాంతి ఉద్యోగి ధ్రువీకరణ ఆధారంగా రుణాలిచ్చేయడం గమనార్హం. గోదాములకెళ్లి సరకు ఉందా? లేదా? ఇతర బ్యాంకుల్లో తనఖా పెట్టారా? బాండ్లు నకిలీవా? అసలువా? రైతులే రుణాలు తీసుకుంటున్నారా? వంటి అంశాలు పక్కాగా పరిశీలించకుండానే రుణాలు మంజూరు చేశారు.

అక్రమాలు జరుగుతున్నాయని ఆపేసినా.....

జీడీసీసీబీ నుంచి రుణాలిచ్చిన ప్రతిసారీ సొమ్ము పక్కదారి పడుతోంది. గతంలో రెండుసార్లు ఇలా వివాదాస్పదం కావడం, రూ. 1.35 కోట్లకుపైగా ఇప్పటికీ వసూలు కాకపోవడంతో ప్లెడ్జ్ రుణాలివ్వడం ఆపేశారు. వైకాపా గద్దెనెక్కాక సొసైటీ పాలకవర్గాలకు ఎన్నికలు నిర్వహించకుండా నామినేట్ చేసి చేతులు దులిపేసుకుంది. వీరు బ్యాంకు యంత్రాంగంపై ఒత్తిడి తెచ్చి గత మూడేళ్లుగా ప్లెడ్జ్ రుణాలు మంజూరు చేయించారు. ఆ బకాయిలే బాగా పేరుకుపోయాయి.


నాడు చెత్త దిబ్బతో.. నేడు ప్రకృతి సిరితో..


నాడు
వైకాపా ప్రభుత్వంలో మంగళగిరి ఎయిమ్స్ రహదారి వెంబడి డంపింగ్ యార్డులా...

రాష్ట్రానికే తలమానికమైన ప్రఖ్యాత మంగళగిరి ఎయిమ్స్ రహదారిలో నాడు వైకాపా ప్రభుత్వంలో చెత్తను వాహనాల్లో తెచ్చి భారీగా డంపింగ్ యార్డులా మార్చారు. ఎయిమ్స్‌కు రోగులు, వైద్యులు, ప్రముఖులు వచ్చేటపుడు విపరీతమైన దుర్వాసన వస్తోందని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఆ ప్రాంతం నుంచి తరలించలేదు. అక్కడే చెత్తను ఎరువు తయారు చేసేందుకు సైతం ఏర్పాట్లు చేశారు. వర్షాలు పడినపుడు చెత్త తడిసి భయంకరంగా దుర్వాసన పరిసరాలలో వెదజల్లేది. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రావడం, మంగళగిరి ఎమ్మెల్యేగా లోకేశ్ గెలుపొందడంతో తక్షణమే డంపింగ్ యార్డును నిలిపేసి వేరే ప్రాంతానికి తరలించారు. దీంతో దుర్వాసన పోయింది.


నేడు
తెదేపా ప్రభుత్వంలో చెత్త తొలగించడంతో పరిశుభ్రంగా..

- ఈనాడు, అమరావతి


ఏర్పాటు చేసిన స్తూపం

స్ఫూర్తి నింపేలా.. కీర్తి నిలిచేలా..

అమరావతి రైతుల పోరాటానికి గుర్తుగా స్తూపం

మేడికొండూరు, న్యూస్‌టుడే: అమరావతి రాజధానిపై ఒక రైతు ప్రేమను చాటుకున్నాడు. గత వైకాపా పాలనలో రాజధాని ఎదుర్కొన్న ఇబ్బందులు, ఇక్కడి రైతుల పోరాటం, చివరకు సీఎం చంద్రబాబు సారథ్యంలోని ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడం తదితర పరిణామాలకు గుర్తుగా మేడికొండూరు మండలం మందపాడుకు చెందిన రైతు వజ్రాల కృష్ణారెడ్డి తన పొలంలో స్తూపం ఏర్పాటు చేశారు. ‘అమరావతి విజయ చిహ్నం’ పేరుతో రాష్ట్ర రాజధాని చిత్రం కనిపించేలా దీన్ని రూపొందించారు. ఇందుకు మొత్తం రూ.2.5 లక్షలు ఖర్చు పెట్టారు. కుమారుడు నాగార్జునరెడ్డి సహకారంతో పంజాబ్ రాష్ట్రానికి చెందిన వ్యవసాయ పరికరాలు తయారీదారులు తండ్రీకూతుళ్లు హర్పాల్ కౌర్, సత్నామ్ సింగ్ దీన్ని డిజైన్ చేశారు. బుధవారం మధ్యాహ్నం గ్రామానికి వచ్చిన వీరిని గ్రామస్థులు సన్మానించారు. కార్యక్రమంలో అప్పిరెడ్డి, తెదేపా నాయకులు సూర్యదేవర వెంకటేశ్వరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.


తాడేపల్లి : ఉండవల్లి నివాసంలో నివాళులర్పిస్తున్న మంత్రి నారా లోకేశ్

గాంధీజీ కలలు సాకారం చేద్దాం

తాడేపల్లి, న్యూస్‌టుడే: సత్యం, అహింస ఆయుధాలుగా స్వాతంత్ర్య సమరాన్ని నడిపించిన జాతిపిత గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాకారం చేయడమే మన కర్తవ్యం కావాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారాలోకేశ్ అన్నారు. సమాజ హితమే అభిమతంగా తన జీవితాన్నే త్యాగం చేసిన మహాత్ముడు నడిచిన మార్గం మనకు స్ఫూర్తి కావాలని అన్నారు. మహాత్మా గాంధీ, లాల్‌బహుదూర్‌శాస్త్రి చిత్రపటాల వద్ద ఆయన బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిజాయతీకి నిలువెత్తు రూపం లాల్‌బహుదూర్ శాస్త్రి అని కొనియాడారు. ప్రధానిగా ఆయన దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు.

ఆరోగ్యకర సమాజం అందరి బాధ్యత

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: ఆరోగ్యవంతమైన సమాజం అందరి బాధ్యతని.. గృహాలతో పాటు పరిసరాల పరిశుభ్రత ముఖ్యమని ప్రతి ఒక్కరూ గుర్తించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో స్వచ్ఛతే సేవ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర సహాయ మంత్రి సభలోని వారితో ప్రతిజ్ఞ చేయించారు. గాంధీజీ, లాల్‌బహుదూర్‌శాస్త్రి జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతలో కీలకపాత్ర పోషించే పారిశుద్ధ్య కార్మికుల ఆత్మాభిమానం పెంపొందించేలా సంక్షేమ కార్యక్రమాలు చిత్తశుద్ధితో అమలు చేస్తామని చెప్పారు. జిల్లా పాలనాధికారి ఎస్.నాగలక్ష్మి మాట్లాడుతూ గాంధీ నుంచి స్ఫూర్తి పొందే అంశాల్లో స్వచ్ఛత ప్రధానమైందన్నారు. జీఎంసీ కమిషనర్ శ్రీనివాసులు, తూర్పు ఎమ్మెల్యే నసీర్, పశ్చిమ ఎమ్మెల్యే మాధవి మాట్లాడారు. ఉత్తమ సేవలందించిన పారిశుద్ధ్య కార్మికులను కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసానితోపాటు అధికారులు, ప్రజాప్రతినిధులు సత్కరించారు. నూతన వస్త్రాలు అందజేశారు. స్వచ్ఛతే సేవలో సహకరించిన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఎన్‌సీసీ వాలంటీర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. సాంబశివపేట ప్రభుత్వ మహిళా కళాశాలలో మాస్ క్లీనింగ్, మొక్కలు నాటే కార్యక్రమంలో మంత్రి డాక్టర్ పెమ్మసాని, జిల్లా పాలనాధికారి నాగలక్ష్మి, కమిషనర్ శ్రీనివాసులు, తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు మహమ్మద్ నసీర్, గల్లా మాధవిలు పాల్గొన్నారు. ఐటీసీ ఉపాధ్యక్షుడు(హెచ్‌ఆర్) వీరాస్వామి, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్ సీహెచ్.శ్రీనివాస్, డి.శ్రీనివాసరావు, టి.వెంకటకృష్ణయ్య, సీపీ రాంబాబు, ఎస్ఈ శ్యాంసుందర్, సీఎంవోహెచ్ డాక్టర్ శోభారాణి పాల్గొన్నారు.


గుంటూరు మహిళా కళాశాల ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఎమ్మెల్యేలు మహమ్మద్ నసీర్, గల్లా మాధవి, కలెక్టర్ నాగలక్ష్మి

పట్టభద్రులూ.. ఓటు నమోదు చేసుకోండి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదుకు నోటిఫికేషన్‌ను విడుదల చేసినట్లు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. మండలాల్లో తహసీల్దార్, ఎంపీడీవో, రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో ఓటరు దరఖాస్తు ఫారం-18 పూర్తి చేసి.. విద్యార్హతలకు సంబంధించిన నకళ్లు గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించి ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. రెండు ఉమ్మడి జిల్లాల్లో 188 సహాయ ఓటరు నమోదు అధికారులు, 104 డిజిగ్నేటెడ్ అధికారులు, 119 అదనపు డిజిగ్నేటెడ్ అధికారులు అందుబాటులో ఉన్నారన్నారు. పట్టభద్రులు నవంబర్ 6వ తేదీ లోపు ఓటరు నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని చెప్పారు.



విజయవాడ-గుంటూరు రహదారిలో తాడేపల్లి వద్ద రహదారి పక్కనే వాహనాలు నిలిపి సేదతీరుతున్నారిలా.



గుంటూరు-విజయవాడ జాతీయ రహదారిపై తాడేపల్లిలో ట్రక్ లే బైలో లారీలు ఆపి సేద తీరుతున్న చోదకులు

ఓ వైపు అలా.. రెండోవైపు ఇలా...!



లారీ ఆపి నిద్రపోతున్న చోదకుడు

గుంటూరు - విజయవాడ జాతీయ రహదారిపై తాడేపల్లి వద్ద ట్రక్ లే బై ఏర్పాటు చేశారు. లారీ డ్రైవర్లు మొదలుకుని వాహనచోదకులు తమ వాహనాలు నిలిపి సేదదీరొచ్చు. ఇక్కడే మరుగుదొడ్లు సైతం ఉన్నాయి. ఇదంతా రహదారికి ఒకవైపు మాత్రమే. మరో వైపు విజయవాడ నుంచి గుంటూరు వైపు వెళ్లే లారీలు ఆపడానికి తాడేపల్లిలో ఇలాంటి ఏర్పాటు లేదు. చాలామంది లారీలు, ట్రక్‌ల వాహనచోదకులు రహదారి పక్కనే అనధికారికంగా నిలిపేస్తున్నారు. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా.. ప్రమాదాలకు ఆస్కారం ఉంది. ప్రత్యేకించి రాత్రి సమయంలో ఈ అనధికారిక పార్కింగ్‌తో చాలా ఇబ్బందిగా ఉందని వాహనచోదకులు చెబుతున్నారు.

- ఈనాడు, అమరావతి

జనన మరణ ధ్రువపత్రాల జారీ మరింత సులువు

ఇటీవల తీసుకొచ్చిన సవరణతో మెరుగైన సేవలు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే



జనన మరణ ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసే విధానంలో ఇటీవల తీసుకొచ్చిన సవరణలతో మెరుగైన సేవలు అందుతాయని గుంటూరు జిల్లా తెనాలి పురపాలక సంఘ జనన మరణాల రిజిస్ట్రార్ డాక్టర్ కె.హెలెన్ నిర్మల పేర్కొన్నారు. బుధవారం ఆమె తెనాలిలో 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు.

24 గంటల్లో డాక్టర్ లాగిన్‌లో..

ప్రైవేటు ఆసుపత్రుల్లో పుట్టిన బిడ్డ వివరాలు 24 గంటల్లో డాక్టర్ లాగిన్ ద్వారా సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టంలో నమోదు చేసి ఆన్‌లైన్‌తో పాటు, మాన్యువల్‌గా రిజిస్ట్రార్ లాగిన్‌కు పంపించాలి. సదరు రిజిస్ట్రార్ వాటిని పరిశీలించిన తరువాత ఏవైనా తప్పులు దొర్లితే చెప్పడానికి 24 గంటలు సమయం ఇస్తారు. జన్మించిన బిడ్డ లేదా మృతుని వివరాలు 21 రోజుల్లో పేర్కొని జనన, మరణ ధ్రువపత్రాలు తీసుకోవచ్చు.

మూడు వారాలు గడిస్తే..

మూడు వారాలు గడిచిన తరువాత నుంచి 30 రోజుల్లోపు దరఖాస్తు చేసుకున్న వారు అపరాధ రుసుము చెల్లించి పొందొచ్చు. అనంతరం ఆ ధ్రువపత్రాలు తీసుకోవాలంటే ఆలస్య రుసుము రూ.5 చెల్లించాక పురపాలక సంఘం ద్వారా జిల్లా జనన, మరణాల రిజిస్ట్రార్‌కు ఆన్‌లైన్‌తో పాటు, మాన్యువల్ విధానంలో దరఖాస్తు పంపించి పొందొచ్చు. ఇలా ఒక ఏడాది లోపు వరకు జనన, మరణాల ధ్రువపత్రాలు పొందొచ్చు.

ఏడాది దాటితే ఇలా..

సంవత్సరం దాటాక ఆర్డీవో లేదా సబ్ కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్ ప్రకారం ధ్రువపత్రాలు తీసుకోవాలి. పురపాలక జనన మరణాల రిజిస్ట్రార్ సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టంలో నమోదు చేసిన జనన, మరణాల వివరాలు పరిశీలించి సదరు ధ్రువపత్రాలు మంజూరు చేస్తారు. ఇలా మంజూరు చేసినట్టుగా దరఖాస్తు దారుని చరవాణికి లాగిన్ వివరాలు పేర్కొన్న సందేశం చేరుతుంది. ఈ లాగిన్ ద్వారా మీసేవ లేదా ఇతర సంస్థల నుంచి జనన, మరణ సర్టిఫికెట్ తీసుకోవచ్చు. లేదంటే పురపాలిక సంఘం నుంచి కూడా పొందొచ్చు.

జిల్లా జనన, మరణాల రిజిస్ట్రార్ లాగిన్‌లో పేర్లు మార్పు

ఉదాహరణకు శ్రీను పేరును ఎస్ఆర్ఐ స్పెల్లింగ్ నుంచి ఎస్ఆర్ఈఈ స్పెల్లింగ్ వంటి మార్పులు తెనాలి పురపాలక సంఘం జనన, మరణాల రిజిస్ట్రార్ సరిచేస్తారు. రవి వర్మ పేరులో రవి మాత్రమే పడిందని వర్మ పేరు చేర్చాల్సి వస్తే ఇలాంటి వాటి సవరణ కోసం విధిగా జిల్లా జనన మరణ రిజిస్ట్రార్ లాగిన్‌కు పంపించాలి. వీటిని కూడా గతంలో పురపాలక సంఘ జనన, మరణాల రిజిస్ట్రార్ సవరించి ధ్రువపత్రం మంజూరు చేసేవారు. ఈ పనిని వీరి నుంచి జిల్లా జనన, మరణాల రిజిస్ట్రార్‌కు బదిలీ చేశారు.

ఆంగ్లం లేదా తెలుగులో..

ఇప్పటికే ఉన్న 1969 చట్టం బర్త్ అండ్ డెత్‌లో తీసుకొచ్చిన సవరణలను 2024 అక్టోబర్ చట్టంగా పిలుచుకుంటున్నారు. గతంలో ఆ ధ్రువపత్రాలు కేవలం ఆంగ్ల భాషలో లభ్యమయ్యేవి. ఇప్పుడు తెచ్చిన సవరణల వల్ల ఆంగ్లం, లేదా తెలుగు, ఈ రెండూ కలిసినవి కూడా తీసుకొనే సౌకర్యం అందుబాటులోకి వచ్చింది.

గతంలో ఇలా..

1969 బర్త్ అండ్ డెత్ చట్టం ప్రకారం.. ఆసుపత్రి వారు పుట్టిన బిడ్డ లేదా మరణించిన వారి వివరాలు సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టంలో ఆన్‌లైన్‌లో 21 రోజుల్లోపు నమోదు చేసి పొందొచ్చు. ఆ గడువు దాటిన తరువాత నుంచి ఏడాదిలోపు వచ్చిన వారు అపరాధ రుసుం చెల్లించి సర్టిఫికెట్స్ తీసుకునే వారు. అప్పుడు జిల్లా జనన, మరణాల రిజిస్ట్రార్ వద్దకు వెళ్లే విధానం ఉండేది కాదు. అలాగే రిజిస్ట్రార్‌కు పంపించిన వివరాలు దరఖాస్తు దారునికి పంపించి సరిచూసుకుని చెప్పమనే విధానం గతంలో లేదు. అలాగే లాగిన్‌లో వివరాలు నమోదైన వాటిని బయట ప్రింట్ తీసుకొనే వసతి లేదు. ఆంగ్ల భాషలో నమోదైన జనన, మరణ ధ్రువపత్రాలు తీసుకునే వారు.

ఏడాదికి 100 గంటల శ్రమదానం



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న రామకృష్ణ

గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: ఇళ్లు, కార్యాలయాలతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉంచేందుకు ఏడాదికి 100 గంటలు శ్రమదానం చేయాలనే సంకల్పాన్ని అందరూ నిర్దేశించుకోవాలని మండల రైల్వే అధికారి రామకృష్ణ సూచించారు. గాంధీ జయంతి, స్వచ్ఛ భారత్ దివస్ సందర్భంగా బుధవారం రైల్వే స్టేషన్‌లో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ స్వచ్ఛ స్టేషన్, స్వచ్ఛ రైలు, స్వచ్ఛ నీర్ వంటి వివిధ రకాల కార్యక్రమాలు ఈనెల 15వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. అనంతరం స్టేషన్ ఆవరణను శుభ్రం చేశారు. ఈసందర్భంగా గాంధీ చిత్రపటానికి డీఆర్ఎం పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సీపీఎం మనోహర్‌రెడ్డి, సీనియర్ డీఎంఈ రవికిరణ్, డీసీఎం ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, పీడీపీ, పీడీఐ నిర్వహణపై రెండో విడతలో అధికారులకు మూడు రోజుల శిక్షణ తరగతులను నిర్వహించనున్నారు. జిల్లాపరిషత్తు సమావేశ మందిరంలో గురువారం ఉదయం పది గంటలకు శిక్షణ ప్రారంభించనున్నారు. డీఎల్‌పీవోలు, మండలాల ఎంపీడీవోలు, ఈవోఆర్‌డీలు శిక్షణ కార్యక్రమానికి హాజరవ్వాలని జడ్పీ సీఈవో జ్యోతిబసు ఉత్తర్వులు జారీ చేశారు.

జోగి రమేష్ బంధువులమంటూ.. జేసీబీ లాక్కున్నారు

మంత్రి లోకేశ్ 'ప్రజా దర్బార్'కు ఫిర్యాదుల వెల్లువ



వృద్ధురాలి సమస్య వింటూ..

తాడేపల్లి, న్యూస్‌టుడే: విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఉండవల్లి నివాసంలో బుధవారం నిర్వహించిన 'ప్రజా దర్బార్'లో రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వచ్చిన వారిని నేరుగా కలుసుకుని సమస్యలు తెలుసుకున్నారు. వారి నుంచి అర్జీలు స్వీకరించి వారి సమస్యల పరిష్కారానికి భరోసా ఇచ్చారు. తన వద్ద ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరుకు చెందిన వైకాపా నేతలు వేములకొండ తిరుపతిరావు, సాంబశివరావు జేసీబీ అద్దెకు తీసుకుని, బాడుగ సొమ్ము ఎగ్గొట్టడంతో పాటు మాజీ మంత్రి జోగి రమేష్ బంధువులమంటూ జేసీబీని స్వాధీనం చేసుకున్నారని ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లికి చెందిన బొర్రా రంగారావు వినతిపత్రం అందజేశారు. వారి దురాగతాల బారినుంచి ప్రాణ భయంతో ఇల్లు వదిలి పారిపోయామని వివరించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. * మంగళగిరి బైపాస్ వద్ద తాను కొనుగోలు చేసిన 380 చ.గ.స్థలాన్ని నకిలీ దస్త్రాలతో స్థానికంగా ఉండే మాజీ కౌన్సిలర్ శివశంకర్, పోకూరి కమలాకర్, కలకోటి వంశీ కబ్జా చేశారని గుంటూరు భారత్‌పేటకు చెందిన వెంకట విరాజీ, రాష్ట్రంలో అగరు కులస్థులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి బీసీ-డి నుంచి బీసీ-బి లోకి మార్చాలని మంత్రి నారా లోకేశ్‌కు ఉత్తరాంధ్ర అగరు కుల సంక్షేమ సంఘం ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. * దివ్యాంగ పింఛన్ పునరుద్ధరించాలని నంద్యాల జిల్లా శ్రీశైలానికి చెందిన శ్రీనివాసులు, క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న తనకు వైద్యసాయం అందించాలని గుంటూరుకు చెందిన షేక్ షబీరా విజ్ఞప్తి చేశారు. అందరి సమస్యలు తెలుసుకున్న మంత్రి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

వరద బాధితుల కోసం విరాళాల అందజేత

ఈనాడు డిజిటల్, అమరావతి: వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్)కి పలువురు వ్యక్తులు, సంస్థల ప్రతినిధులు విరాళాలు ఇచ్చారు. సంబంధిత చెక్కుల్ని ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేశ్‌కు బుధవారం అందజేశారు. మంగళగిరికి చెందిన ఆంధ్ర హరికుమార్ రూ.2 లక్షలు, దాసరి రామారావు రూ.1,01,116, మంగళగిరి వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.50,116 విలువైన చెక్కులను లోకేశ్‌కు వేర్వేరుగా అందించారు.

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

చుండూరు: విజయవాడ - చెన్నై రైలు మార్గంలో విజయవాడ నుంచి బాపట్ల వైపు బియ్యం లోడుతో వెళుతున్న గూడ్స్ రైలు చివరి బోగి మండూరు సమీపంలో పట్టాలు తప్పింది. సిబ్బంది మరమ్మతులు చేయించి గూడ్స్ రైలును అక్కడి నుంచి బాపట్ల వైపు పంపారు.

జనాభా ప్రాతిపదికన మద్యం దుకాణాల ఏర్పాటు



టెండర్ల ప్రక్రియ పరిశీలిస్తున్న శ్రీనివాసులు, అరుణకుమారి, మారయ్యబాబు, వీరాంజనేయులు తదితరులు

మంగళగిరి, తాడేపల్లి, న్యూస్‌టుడే: మద్యం నూతన విధానంలో జనాభా ప్రాతిపదికన దుకాణాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. మంగళగిరిలోని ఆ శాఖ కార్యాలయంలో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల ఒకటి నుంచి తొమ్మిదో తేదీ వరకు మద్యం దుకాణాల కోసం దరఖాస్తులు స్వీకరణ, 11న కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ, 12వ తేదీ నుంచి అమ్మకాలు ప్రైవేటు దుకాణాల నుంచి కొనసాగుతాయన్నారు. గుంటూరు జిల్లాలో 127 దుకాణాలు, పల్నాడు జిల్లాలో 129 దుకాణాలకు నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. గతంలో ఒక వ్యక్తికి ఒకే దుకాణం ఉండేది. కొత్త విధానంలో ఒక వ్యక్తి ఎన్ని షాపులకైనా పాల్గొనవచ్చు. ప్రతి దరఖాస్తుకు రూ.2 లక్షలు నాన్ రిఫండ్ లైసెన్స్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేయవచ్చని వివరించారు. మంగళగిరి ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు అందుతున్నాయి. గుంటూరు జిల్లాకు సంబంధించి వెంకటేశ్వర విజ్ఞాన మందిరం, పల్నాడు జిల్లా నరసరావుపేటలో ప్రకాశ్‌నగర్‌లో ఉన్న టౌన్ హాల్లో వేలంలో భాగంగా లాటరీ నిర్వహిస్తారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అరుణకుమారి, అసిస్టెంట్ కమిషనర్ మారయ్యబాబు, సీఐ వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

తెనాలిలో బౌన్సర్ హత్య



కోటేశ్వరరావు మృతదేహం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలిలో రోడ్డు వెంబడి పడి ఉన్న యువకుడి మృతదేహం కలకలం సృష్టించింది. తెనాలి గ్రామీణ పోలీస్ స్టేషన్ సీఐ బి.శ్రీనివాసరావు బుధవారం తెలిపిన సమాచారం మేరకు.. తెనాలి బుర్రిపాలెం రోడ్డులోని ప్రైవేటు లేఔట్ ఖాళీ స్థలంలో యువకుడి మృతదేహం పడి ఉందని వాకర్స్ ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి విచారణ చేపట్టారు. తెనాలి మండలం బుర్రిపాలెంకు చెందిన పి.కోటేశ్వరరావు(38) హత్యకు గురైనట్లు గుర్తించారు. బీరు సీసా లేదా పదునైన ఆయుధంతో గొంతు, మెడ, గుండెల మీద దాడి చేయడంతో తీవ్ర గాయాలై కోటేశ్వరరావు ఘటనా స్థలిలోనే ప్రాణాలు విడిచినట్లు గుర్తించారు. కోటేశ్వరరావు గతంలో స్థానికంగా జిమ్ ట్రైనర్‌గా, పోలీస్ జీపులు, ఇతర వాహనాలకు ప్రైవేటు డ్రైవర్‌గా పని చేశాడు. సుమారు 8 ఏళ్ల కిందట హైదరాబాద్ వెళ్లి అక్కడ సినీ, రాజకీయ ప్రముఖులకు బౌన్సర్‌గా పని చేస్తున్నాడు. రెండు రోజుల కిందట బ్యాంకు ఖాతా పని మీద తెనాలి వచ్చిన కోటేశ్వరరావు మంగళవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి 8 గంటల సమయంలో తాను తన మిత్రుడు షఫితో కలిసి ఉన్నానని, రేపు ఉదయం వస్తానని కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా తెలిపాడు. బుధవారం ఉదయం కోటేశ్వరరావు హత్యకు గురయ్యాడని కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. మంగళవారం మధ్యాహ్నం నుంచి మరో మిత్రుడు వెంకటేష్‌తో కూడా కోటేశ్వరరావు కలిసి ఉన్నాడని పోలీసుల విచారణలో తేలింది. మంగళవారం రాత్రి మద్యం తాగిన అనంతరం ఈ ఘటన జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. హతుడి వెంట ఎవరెవరు ఉన్నారు? అసలు ఏం జరిగింది అన్న అంశాలను పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పలువురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. క్లూస్ టీం వచ్చి ఆధారాలు సేకరించింది. కాగా కోటేశ్వరరావు అవివాహితుడు. శిక్షణ డీఎస్పీ భార్గవి, సీఐ శ్రీనివాసరావు, సిబ్బంది వివరాలు నమోదు చేసుకున్నారు.

చేనేత పరిశ్రమకు చంద్రబాబు పెద్దపీట



ప్రదర్శన తిలకిస్తున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే గల్లా మాధవి, కలెక్టర్ నాగలక్ష్మి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: 'గత వైకాపా ప్రభుత్వంలో చేనేత కార్మికుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. ఎందరో నేతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నారు. చేనేతలను ఆదుకుని వారి జీవితాల్లో సమూలంగా మార్పులు తీసుకువచ్చేందుకు చంద్రబాబు చేనేత పరిశ్రమకు పెద్దపీట వేస్తున్నారు'.. అని బీసీ సంక్షేమం, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు. గుంటూరు రింగ్‌రోడ్డులోని సిద్ధార్థ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శనను బుధవారం ఆమె ప్రారంభించారు. ప్రదర్శనలో స్టాళ్లను సందర్శించి చేనేత వస్త్రాలు, కళాకృతులను పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ 'చేనేతల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. నేతన్నలు ఆత్మగౌరవంతో కూడిన జీవనం సాగించేలా కార్యాచరణ ప్రారంభమైంది. చేనేత వస్త్రాల్లో నూతన డిజైన్ల తయారీకి శిక్షణ ఇస్తున్నాం. వారు తయారుచేసే వస్త్రాలకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తున్నాం. ఇటీవల విజయవాడలో జరిగిన చేనేత వస్త్ర ప్రదర్శనలో రూ.2 కోట్లకు పైగా వస్త్ర విక్రయాలు జరిగాయి. ఈ ప్రదర్శన విజయవంతం కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని నిర్ణయించాం. ఇందులో భాగంగా గుంటూరులో ప్రదర్శన 14వ తేదీ వరకు కొనసాగుతుంది. నగరవాసులు చేనేత వస్త్రాలను ధరించి నేతన్నలను ఆదరించాలి'.. అని పిలుపునిచ్చారు. పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ చేనేత కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ గాంధీజీ జీవితంలో ఖాదీ ఒక భాగమైందన్నారు. జిల్లాలో మంగళగిరి, పొన్నూరు ప్రాంతాల్లో చేనేత సొసైటీలు, పరిశ్రమలున్నాయని, నేత కార్మికుల అభ్యున్నతికి చేయూత అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ సునీత, చేనేత జౌళీశాఖ కమిషనర్ రేఖా రాణి, ఆర్డీఓ శ్రీనివాసరావు, చేనేత జౌళీశాఖ సహాయ సంచాలకుడు ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల గాలం

పోలీసుల అప్రమత్తతతో తప్పిన ప్రమాదం



ఎస్సై ప్రజల వాట్సాప్‌లకు పంపిస్తున్న ఎస్పీ ప్రకటన

ఈమని(దుగ్గిరాల), న్యూస్‌టుడే: ఇటీవల ఈమనిలో సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.19.8 లక్షలు కోల్పోయిన సంగతి మరవక ముందే నేరగాళ్లు మరొకరి విషయంలో అదే ప్రయత్నం చేశారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న గ్రామానికి చెందిన ఒక యువతి తండ్రికి బుధవారం ఉదయం ఒక ఫోన్ వచ్చింది. తాము సీబీఐ నుంచి ఫోన్ చేస్తున్నామని, వాళ్ల కూతురు మనీల్యాండరింగ్ కేసులో ఇరుక్కుందని చెప్పారు. అరెస్టు చేస్తే పరువు పోతుందని, అలా చేయకుండా ఉండాలంటే కొంత మొత్తం ఇవ్వాలని నేరగాళ్లు ఫోన్‌లో డిమాండ్ చేశారు. యువతి తండ్రి తమకు వచ్చిన ఫోన్ కాల్ విషయం ఎస్సై వెంకటరవికి చెప్పారు. ఆయన వెంటనే 'డిజిటల్ అరెస్టుతో జాగ్రత్త' అంటూ ఎస్పీ సతీష్‌కుమార్ పంపిన ప్రకటనను వారికి ఇచ్చి ఎవరైతే ఫోన్ చేస్తారో వాళ్లకు పంపమని చెప్పారు. ఆయన తమను బెదిరించిన వారికి వాట్సాప్‌లో పంపారు. దీంతో నేరగాళ్లు మళ్లీ ఫోన్ చేయలేదు. తమ చరవాణి నెంబరును స్విచ్ఛాఫ్ చేసేశారు. నేరగాళ్లు ప్రధానంగా చదువుకున్న వారిని, సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నవారిని లక్ష్యంగా పెట్టుకున్నారని ఎస్సై తెలిపారు. అప్రమత్తంగా ఉండాలంటూ మండలంలోని వాట్సాప్ గ్రూపులకు ఆయన ప్రకటన పంపిస్తున్నారు. ఈ ప్రకటనను ఎవరికి వాళ్లు తమకు తెలిసిన వారికి పంపాలని కోరారు.

జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు జట్ల ఎంపిక

వినుకొండ రూరల్: వినుకొండ లయోల పాఠశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించి జమ్ము కశ్మీర్‌లో నిర్వహించే జాతీయ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర బాల, బాలికల జట్లను ఎంపిక చేసినట్లు స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి సురేష్‌కుమార్ తెలిపారు. గుంటూరు నుంచి బాలుర జట్టులో అలీ, నాగనజీర్, నవీన్, బాలికల జట్టులో మహేశ్వరి, ప్రవల్లిక, వాసంతి ఎంపికయ్యారు.

చిన్నారి మృతదేహం లభ్యం

పటమట, న్యూస్‌టుడే: విజయవాడ స్క్యూబ్రిడ్జ్ సమీపంలో తల్లి.. తన ఇద్దరు బిడ్డలతో కలిసి బందరు కాలువలో ఆదివారం దూకిన ఘటనలో చిన్నారి జాస్వి (18 నెలలు) మృతదేహం బుధవారం చోడవరం వద్ద లభ్యమైంది. నాలుగు రోజుల పాటు మృతదేహం నీళ్లలో ఉండటంతో ఉబ్బిపోయింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మంగళవారం లభ్యమైన తల్లి తిరుపతి సుధారాణి మృతదేహానికి బుధవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మరో చిన్నారి మృతదేహం ఆదివారం నాడే దొరికిన సంగతి తెలిసిందే. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పవన్ కిషోర్ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కిలో ।కి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 121, రిటైల్ ధర - 143, చికెన్ విత్‌స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -116 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, 132, 142 చికెన్ విత్ స్కిన్ - 230 చికెన్ స్కిన్‌లెస్ - 240.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 535 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.84/-.

విద్యావ్యవస్థలో గురుకుల విద్యాలయాల పాత్ర గణనీయం



అతిథులతో అవార్డులు స్వీకరించిన అధ్యాపకులు

నెహ్రూనగర్ (గుంటూరు), న్యూస్‌టుడే: ప్రభుత్వ విద్యారంగంలో గురుకుల పాఠశాలలు, కళాశాలలు దశాబ్దాలుగా ఉన్నత ప్రమాణాలతో రాణిస్తున్నాయని, ఇందుకు అక్కడ పని చేసే ఉపాధ్యాయ, అధ్యాపక, సిబ్బంది అంకితభావంతో కృషి చేయడం అభినందనీయమని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. వీఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2024 రాష్ట్ర స్థాయి ఉత్తమ గురుకుల ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవం బుధవారం గుంటూరు బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ముఖ్యఅతిథి పాల్గొన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ గురుకులాల్లో ఉపాధ్యాయుల అత్యుత్తమ శిక్షణతో 150 మందికి పైగా విద్యార్థులు ఐఏఎస్‌లుగా.. వందలాది మంది ఉన్నత స్థానాల్లో కీర్తిప్రతిష్ఠలు గడించారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల నుంచి ఎంపిక చేసిన ఉత్తమ గురువులను సత్కరించి పురస్కారాలు ప్రదానం చేశారు. విద్యాశాఖ డిప్యూటీ కార్యదర్శి ఆర్.వెంకటేశ్వర్లు, ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ టీచర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు రవిచంద్ర, ఫౌండేషన్ ఛైర్మన్ ఆచార్యులు ఎం.రోజా, కో-ఛైర్మన్ డాక్టర్ పీవీ మల్లేశ్వర్, నాయకులు వెంకటరమణ, ఉబేదుల్లా, కేబీబీ రావ్, గోవిందరెడ్డి, జగన్ పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

మంగళగిరి, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతున్న వారికి చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి విడుదలైన నగదు చెక్కులను తెదేపా నాయకులు బుధవారం పంపిణీ చేశారు. ఎర్రబాలెంకి చెందిన బాణాల తిరుపతమ్మకు రూ.50 వేలు, లేళ్ల రంగమ్మకు రూ.2,17,200 మంజూరయ్యాయి. వీటిని సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోటా పార్థసారథి, నాయకులు మల్లవరపు వెంకట్, కర్నాటి సత్యనారాయణ, గడదాసు రంగారావు తదితరులు బాధితుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. బాధితులకు అండగా ఉంటామన్నారు.

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

ఆలయ అభివృద్ధికి వితరణ

కంఠంరాజుకొండూరు(దుగ్గిరాల), న్యూస్‌టుడే: కంఠంరాజుకొండూరు మహంకాళీ అమ్మవారి ఆలయ అభివృద్ధికి కృష్ణాజిల్లా గుడివాడకు చెందిన కొవ్వివేని నిషాంత్ రూ.లక్ష వితరణగా బుధవారం అందజేశారు. దాత కుటుంబ సభ్యులను వంశపారంపర్య ధర్మకర్త దేవభక్తుని రంగప్రసాద్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాన్ని అందించి సత్కరించారు. అర్చకులు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


దాత కుటుంబ సభ్యుల్ని సత్కరిస్తున్న రంగప్రసాద్, అర్చకులు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

? తాడికొండ ఆంధ్రాబ్యాంక్ సమీపంలో శివాలయం పక్కన చెత్త పేరుకుపోయింది. దుర్వాసన వ్యాపిస్తోంది. **-పవన్, గ్రామస్థుడు**

✔ ఆ ప్రాంతంలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తాం. బ్లీచింగ్ జల్లిస్తాం. **- శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి**
-న్యూస్‌టుడే, తాడికొండ

? ప్రత్తిపాడు మంచినీటి చెరువు ట్యాంకు బజారులో చెత్త, వ్యర్థాలు చాలా రోజుల నుంచి పేరుకుపోయాయి. కుక్కలు చేరి దారిన వెళ్లే వారిపై దాడి చేస్తున్నాయి. **-రవిబాబు, స్థానికుడు**

✔ పారిశుద్ధ్య కార్మికులను పంపి తొలగింపజేస్తాం. **-జాన్ పీరా, పంచాయతీ కార్యదర్శి, ప్రత్తిపాడు**
-న్యూస్‌టుడే, ప్రత్తిపాడు

పెండింగ్ జీతాలివ్వండి

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధాని పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న రెండు నెలల జీతాలను చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేశారు. సీఆర్డీఏ అధికారులు స్పందించాలని రాజధాని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు ఎం.రవి కోరారు. బకాయిలు అడుగుతుంటే శానిటరీ అధికారులు వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం

తుళ్లూరు, న్యూస్‌టుడే: లైన్ల మరమ్మతుల నేపథ్యంలో గురువారం వెంకటపాలెం గ్రామంలో ఉదయం 9 గం.ల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈ ఉమామహేశ్వరావు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

దారంతా గోతులు.. ప్రయాణికుల తిప్పలు

తుళ్లూరు, న్యూస్‌టుడే

పెదపరిమి నుంచి వడ్డమాను వరకు ఉన్న రహదారి పూర్తిగా ధ్వంసమై అధ్వానంగా మారింది. రహదారిపై కంకర కొట్టుకుపోయి గోతులు మయంగా మారింది. గతుకుల రహదారిపై రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు నిత్యం నరకం చూస్తున్నారు. వాహనాలపై ప్రయాణాలు చేస్తున్న వారి ఒళ్లుహూనం అవుతుంది. పెదపరిమి గ్రామం నుంచి వడ్డమాను శివారు వైకుంఠపురం మూల మలుపు వరకు సుమారు 12 కి.మీ రహదారి నిర్మాణానికి వైకాపా ప్రభుత్వం చివరి దశలో రూ.6 కోట్లతో టెండర్లు పిలిచి హడావుడిగా పనులు చేపట్టారు. మాజీ మంత్రి మేకతోటి సుచరిత కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఎన్నికల తరువాత పనులు నిలిచిపోవడం జరిగింది. గ్రామాల మధ్య సీఆర్డీఏ ప్లాట్లకు కేటాయించిన భూమిని మినహాయించి రహదారి నిర్మించాల్సి ఉంది. మరో వైపు తుళ్లూరు నుంచి పల్నాడు జిల్లా వైకుంఠపురం వరకు ఉన్న రహదారి గోతులు పడి దారుణంగా మారింది. తుళ్లూరు శివారులో టిడ్కో గృహాల సమీపంలో రహదారిపై భారీ గుంత పడి వర్షపు నీరు నిలుస్తోంది. దీంతో అటుగా రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు ఇబ్బందులు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


తుళ్లూరు శివారు భారీ గుంత


అధ్వానంగా పెదపరిమి- వడ్డమాను రహదారి

ఇలా చేస్తే మేలు..

★ దొండపాడు శివారు నుంచి నెక్కల్లు శివారు వరకు ఉన్న ఎన్-17 రాజధాని రహదారిని సీఆర్డీఏ నిర్మించి వడ్డమాను గ్రామం నుంచి వైకుంఠపురం వరకు.

★ జిల్లా పరిషత్ రహదారి నిర్మాణం చేస్తే పెదపరిమి, నెక్కల్లు, అనంతవరం, వడ్డమాను ప్రజలు రాకపోకలు సాగించడానికి వీలుగా ఉంటుందని స్థానికులు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

పెదపరిమి నుంచి వడ్డమాను శివారు వరకు రహదారి నిర్మాణానికి గతంలో టెండర్లు జరిగాయి. రహదారిలో కొంత భాగం సీఆర్డీఏ పరిధిలో ఉండటంతో రహదారి నిర్మాణం నిలిచిపోయింది. సీఆర్డీఏ పరిధిలో లేని రహదారిని నిర్మించేందుకు పై అధికారులను సంప్రదించాం. అనుమతులు రాగానే పనులు ప్రారంభించి రహదారి నిర్మాణం చేపడతాం.

– కిషోర్ బాబు, తాడికొండ ఏఈ

ప్రజా ప్రభుత్వం అందరికీ అండగా ఉంటుంది

'ప్రజా దర్బార్'లో మంత్రి నారా లోకేశ్

తాడేపల్లి, న్యూస్‌టుడే: ప్రజాప్రభుత్వం ప్రతి ఒక్కరికీ అండగా ఉంటుందని విద్య, ఐటీ శాఖల మంత్రి, మంగళగిరి శాసనసభ్యులు నారా లోకేశ్ అన్నారు. ఉండవల్లి నివాసంలో బుధవారం ఆయన ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుంచి నేరుగా సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఉద్యోగం పేరుతో రూ.లక్షలు వసూలు చేసి మోసం చేసిన కురగంటి జాన్‌పై చర్యలు తీసుకోవాలని తాడేపల్లికి చెందిన జ్యోతుల మహేష్‌బాబు వినతిపత్రం అందజేశారు. తీసుకున్న నగదు తిరిగి చెల్లించాలని కోరితే దాడులకు పాల్పడుతున్నారని వాపోయారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటానని మంత్రి భరోసా ఇచ్చారు. చేనేత వృత్తి చేస్తూ జీవనం సాగించే తమ మగ్గం దెబ్బతిని నష్టపోయానని పరిహారమిచ్చి ఆదుకోవాలని కోరారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి రెండు కాళ్లు పోగొట్టుకున్న తనకు దివ్యాంగ పింఛన్ మంజూరు చేయాలని మంగళగిరికి చెందిన వల వీటి షష కోరారు. దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న తన కుమారుడికి పింఛన్ మంజూరు చేయించాలని తాడేపల్లి మహానాడుకు చెందిన వీరంద్రరెడ్డి మంత్రికి అర్జీలు ఇచ్చారు.


మహిళ గోడు వింటున్న మంత్రి

రాజధాని రైతులపై కేసులు తొలగించాలి

తుళ్లూరు, న్యూస్‌టుడే: తాడికొండ నియోజకవర్గ తెదేపా అర్బన్ కోఆర్డినేటర్ నెలకుదిటి చందు బుధవారం ఉండవల్లిలో మంత్రి లోకేశ్‌ను కలిశారు. అమరావతి ఉద్యమంలో రాజధాని రైతులు, రైతు కూలీలు, మహిళలపై పెట్టిన అక్రమ కేసులను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అమరావతి ఉద్యమాన్ని కవర్ చేయటానికి వచ్చిన పలువురు విలేకరులపైనా వైకాపా ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ కేసులు బనాయించి ఇబ్బందులకు గురి చేసిందని వివరించారు.

'కుమార్తె మృతికి కారకులపై చర్యలు తీసుకోండి'

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : తమ కుమార్తె మృతికి కారకులైన వారితో పాటు సహకరిస్తున్న వైకాపా నాయకులపై తగిన చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా నల్లపాడుకు చెందిన శంకరలీల.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి విజ్ఞప్తి చేశారు. న్యాయవాది సలీంతో కలిసి బుధవారం ఆమె విజయవాడ ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్న తన కుమార్తె జననీని బండారు ఆనంద్ అనే ఆటో డ్రైవర్ ప్రేమ పేరుతో వంచించాడని ఆరోపించారు. మాయమాటలు చెప్పి ఎత్తుకెళ్లాడని పేర్కొన్నారు. దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. వైకాపా నాయకుల అండదండలతో తిరిగి తమపైనే అక్రమ కేసులు బనాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. 14నెలల తర్వాత తమ కుమార్తె ఆస్పత్రిలో శవమై తేలిందని కన్నీటి పర్యంతమయ్యారు. ఏడాది గడుస్తున్నా.. ఇప్పటికీ తమకు న్యాయం జరగలేదని వాపోయారు. న్యాయవాది సలీం మాట్లాడుతూ.. ఈ కేసులో బాధితులకు న్యాయం జరగకపోగా, అక్రమ కేసులు బనాయించడం దారుణమన్నారు. మృతురాలి పెద్దమ్మ సోదరి ఓంకారమ్మ పాల్గొన్నారు.


ప్రత్తిపాడు: వేణుగోపాలస్వామి, సీతారామ స్వామి ఆలయంలో ఏర్పాట్లు


దుగ్గిరాలలో విద్యుద్దీప కాంతుల్లో కాళీ మాత ఆలయం

'అమ్మ' పండగకు అన్నీ సిద్ధం

నేటి నుంచి శరన్నవరాత్రి వేడుకలు

న్యూస్‌టుడే బృందం: దసరా నవరాత్రులకు అమ్మవారి ఆలయాలు ముస్తాబయ్యాయి. మంగళగిరి, ప్రత్తిపాడు, తాడికొండ నియోజకవర్గాల వ్యాప్తంగా ఆలయాలన్నీ విద్యుద్దీపాలతో కళకళలాడుతున్నాయి. గురువారం నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలకు అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. సన్నద్ధ పూజలు నిర్వహించారు. పలు చోట్ల కార్యక్రమాల వివరాలు తెలిపే కరపత్రికలను ఆవిష్కరించారు.


తాడేపల్లి: అయోధ్య ప్రాంగణంలో ఆహ్వాన పత్రికలు విడుదల చేస్తున్న కమిటీ ప్రతినిధులు కిషోర్, వెంకటేష్ తదితరులు

వైభవం.. శ్రీవారి కల్యాణం


అలంకరణలో స్వామివారు

తాడేపల్లి, న్యూస్‌టుడే: సీతానగరం కొండపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాన్ని బుధవారం అత్యంత వేడుకగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు సుదర్శనహోమం, అష్టోత్తర శతనామార్చన జరిపించారు. అనంతరం పద్మావతిదేవి అమ్మవారికి తిరుమంజనసేవ నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

చేనేత రంగం సమస్యలు పరిష్కరించండి



గాంధీజీ విగ్రహం వద్ద నాయకుల నిరసన

మంగళగిరి, న్యూస్‌టుడే: చేనేత రంగం ఎదుర్కొనే సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ మంగళగిరిలోని మహాత్మగాంధీ విగ్రహం వద్ద ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ బుధవారం నిరసన వ్యక్తం చేసింది. గాంధీ జయంతి సందర్భంగా తమ డిమాండ్ల సాధన కోసం నిరసన వ్యక్తం చేస్తున్నట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలను చిత్తశుద్ధితో అమల చేయాలని కోరారు. ప్రతీ చేనేత కార్మికునికి రూ.25వేలు అందజేయాలన్నారు. చేనేతకు కేటాయించిన 11రకాల రిజర్వేషన్లు అమలు జరపాలి. కార్మికుని కుటుంబానికి 200 యూనిట్లు విద్యుత్తు ఉచితంగా ఇవ్వాలని కోరారు. ప్రతి కార్మికుడి కుటుంబానికి మూడు సెంట్లు స్థలం కేటాయించాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఇంకా కొంతమందికి పరిహారం అందలేదని వాటిని విడుదల చేయాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కార్యదర్శి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



పెదనందిపాడు: ఊరేగింపులో రోటరీ గవర్నర్ శరత్ చౌదరి, సభ్యులు


పెదనందిపాడు: నాగులపాడు గ్రంథాలయంలో నివాళులర్పిస్తున్న సర్పంచి, గ్రామస్థులు


తాడేపల్లి తెదేపా కార్యాలయంలో ..


మంగళగిరి: ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్ట్ కార్యాలయంలో డాక్టర్ లక్ష్మీశా..

గాంధీజీ అడుగు జాడల్లో నడవాలి


ఊరూవాడా ఘనంగా జయంతి కార్యక్రమాలు


తిమ్మాపురం: వ్యర్థాల నిర్వహణ కేంద్రం వద్ద సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లూరి శ్రీనివాసరావు, అధికారులు..

జాతిపిత గాంధీజీ అడుగు జాడల్లో నేటి తరం నడవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం మంగళగిరి, ప్రత్తిపాడు, తాడికొండ నియోజకవర్గాల వ్యాప్తంగా బుధవారం బాపూజీ జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు వివిధ పార్టీలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థ నాయకులు, ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు పూలమాలలేసి నివాళులర్పించారు. పలు చోట్ల మిఠాయిలు పంచిపెట్టారు. అవగాహన ప్రదర్శనలు నిర్వహించారు. తాడికొండ మండలం పాములపాడు సచివాలయం ఆవరణలో దాత పరుచూరి నారాయణ తల్లిదండ్రులు పరుచూరి వెంకటప్పయ్య, శేషమ్మల జ్ఞాపకార్థం రూ.30,000 ఖర్చుతో గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. **-న్యూస్‌టుడే బృందం**


మంగళగిరి : నివాళులర్పిస్తున్న రాష్ట్రాధ్యక్షుడు శంకరరావు, నాయకులు


మంగళగిరిలో భాజపా ఆధ్వర్యంలో..


ప్రత్తిపాడులో భాజపా రాష్ట్ర నాయకులు జంధ్యాల రామలింగేశ్వర శాస్త్రి, నాయకులు


పాములపాడు సచివాలయంలో ఏర్పాటు చేసిన గాంధీజీ విగ్రహం


దుగ్గిరాల శివాలయం వద్ద ఎంపీపీ జబీన్, శ్రీఅనిత..

గోశాలలో స్వచ్ఛ భారత్

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: గుడి-బడి సంస్థ ఆధ్వర్యంలో వెంగళాయపాలెంలోని నగరపాలక సంస్థకు చెందిన గోశాలలో బుధవారం స్వచ్ఛ భారత్ నిర్వహించి గోవులను పూజించారు. ప్రతినిధులు త్రికోటేశ్వరరావు రామరాజు, శివప్రసాదు, రాజా, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

పెదనందిపాడు, న్యూస్‌టుడే: 'రక్తదానం చేయండి.. ప్రాణాలు కాపాడండి' అని రోటరీ గవర్నర్ కె.శరత్‌చౌదరి అన్నారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గాంధీ జయంతి సందర్భంగా బుధవారం పెదనందిపాడు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. 26 మంది రక్తదానం చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు శివప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో రోటరీ డిప్యూటీ గవర్నర్, సహాయ గవర్నర్ పి. శివరంజని, మలినేని పెరుమాళ్ల, క్లబ్ రీజనల్ ఛైర్మన్ పి. నాగేశ్వరరావు, వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు

ప్రత్తిపాడు, మంగళగిరి, తాడేపల్లి, న్యూస్‌టుడే: నూతన మద్యం విధానం- 2024 ప్రకారం లైసెన్సు మద్యం దుకాణాలకు ప్రత్తిపాడు ఎక్సైజ్ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రత్తిపాడు ఎక్సైజ్ కార్యాలయం పరిధిలోని ప్రత్తిపాడు మండలంలో 4, వట్టిచెరుకూరు మండలంలో 3, చేబ్రోలు మండలంలో అత్యధికంగా 6 దుకాణాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఎస్సై ఎం.రవీంద్రబాబు చెప్పారు. ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5గంటల లోపు దరఖాస్తులను కార్యాలయంలో అందించాలని సూచించారు. ఇక నియోజకవర్గంలోని గ్రామీణ గుంటూరు మండలంలో 2, పెదనందిపాడు మండలంలో 3, కాకుమాను మండలంలో 2 దుకాణాలకు నోటిఫికేషన్ ఇచ్చారు. ❖ మంగళగిరి, తాడేపల్లి అర్బన్ ప్రాంతాల్లో 19, తాడికొండ 5, తుళ్లూరు 4 దుకాణాలకు నోటిఫికేషన్ ఇచ్చినట్లు మంగళగిరి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ వీరాంజనేయులు తెలిపారు.


ప్రత్తిపాడు: ఎక్సైజ్ కార్యాలయం

గండి పూడ్చిన జనసైనికులు



వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే: ముట్లూరు, కారంపూడిపాడు మధ్య జల్లవాగు వంతెనపై జనసేన నాయకులు పంచాయతీరాజ్ రోడ్డుకు ఏర్పడిన గండిని బుధవారం పూడ్చారు. తరచూ ప్రమాదాలు సంభవిస్తుండడంతో కంకరతో ఈ పనులు చేపట్టారు.

మహిళపై దాడి

తుళ్లూరు: మందడానికి చెందిన మర్రిపూడి శంకర్ తనకు చెందిన స్థలం మీదుగా జేసీబీ యంత్రాన్ని తీసుకెళ్లడంతో గోతులు పడిందని, దీనిపై ప్రశ్నించినందుకు అతడి కుటుంబ సభ్యులతో కలిసి దాడి చేశాడని స్థానికురాలు భారతీ తుళ్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు.

గ్రామసభలో ఘర్షణ

కాట్రపాడు(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: కాట్రపాడు గ్రామంలో పంచాయతీ భవనం సమీపంలో జరిగిన గ్రామసభలో ఇరువర్గాల మధ్య స్వల్ప తోపులాట చోటు చేసుకుంది. ఈ క్రమంలో గ్రామానికి చెందిన ఓ వర్గానికి చెందిన నాయకుడు కిందపడి పోయాడు. సీఐ రామానాయక్ అక్కడకు చేరుకుని ఇరువర్గాలకు నచ్చజెప్పి ఇళ్లకు పంపించారు. గ్రామంలో వివాదాలకు దిగితే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

పోక్సో కేసు నమోదు

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే: మండలంలోని గ్రామంలో ఏడో తరగతి చదువుతున్న బాలికతో అదే తరగతి చదువుతున్న బాలుడు అసభ్యంగా ప్రవర్తించి, దూషించాడని సీఐ రామానాయక్ బుధవారం తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బాలుడు, అతడి తల్లిదండ్రులపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

జూదరుల అరెస్టు

ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే: తక్కెళ్లపాడులో నిర్వహిస్తున్న జూద శిబిరంపై సిబ్బందితో దాడి చేసి ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు సీఐ రవీంద్రబాబు తెలిపారు. నిందితుల వద్ద రూ.25 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎనలేనివి

మంగళగిరి, దుగ్గిరాల, తుళ్లూరు, న్యూస్‌టుడే: నగర పరిశుభ్రతకు పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవలు ఎనలేనివని మంగళగిరి, తాడేపల్లి నగరపాలక కమిషనర్ అలీంబాషా అన్నారు. స్వచ్ఛతా హి సేవ - 2024లో భాగంగా నగరంలోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో కార్మికులంతా శక్తివంచన లేకుండా పనిచేస్తున్నారని తెలిపారు. మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. అసిస్టెంట్ కమిషనర్ శ్రీకాంత్, సీఐ వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. దుగ్గిరాల పంచాయతీలో పనిచేస్తున్న 32 మంది పారిశుద్ధ్య కార్మికులకు సర్పంచి బాణావత్ కుషీబాయి ఆధ్వర్యంలో బుధవారం దుస్తులు పంపిణీ చేశారు. ఎంపీపీ షేక్ జబీన్, ఎంపీడీవో శ్రీనివాసరావు, కార్యదర్శి శరత్, తెదేపా మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత పాల్గొన్నారు. ఐనవోలు గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులకు గ్లౌజులు, మాస్కులు అందజేశారు. స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తూ మంగళగిరిలో కేఎల్‌యూ విద్యార్థులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. పద్మశాలీ కార్పొరేషన్ డైరెక్టర్ కందుల నాగార్జున దీన్ని ప్రారంభించారు.


దుగ్గిరాలలో..


కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న అలీంబాషా, శ్రీకాంత్

? పట్టణ పరిధి నిడుబ్రోలు వడ్డిముక్కల రోడ్డులో మురుగు కాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయి.
-ఎన్.డేవిడ్, నిడుబ్రోలు

✔ చెత్త తొలగింపునకు చర్యలు తీసుకుంటా.
- శ్రీనివాసరావు, ప్రజారోగ్యశాఖాధికారి

? పట్టణ పరిధి భావనగర్ కాలనీలో రెండు రోజులు నుంచి చెత్తను తొలగించలేదు. ఆ మార్గంలో రాకపోకలు నిర్వహించడానికి చాలా ఇబ్బందికరంగా ఉంది. **- పి.నారాయణ, భావనగర్ కాలనీ**

✔ చెత్తను తొలగించే విధంగా తగు చర్యలు తీసుకుంటా. **- శ్రీనివాసరావు, ప్రజారోగ్య శాఖాధికారి**

నేటి నుంచి దసరా ఉత్సవాలు

పెదకాకాని: స్థానిక మల్లేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభం కానున్నట్లు ఈవో లీలాకుమార్ తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. తొలి రోజు బాలా త్రిపురసుందరి దేవిగా భ్రమరాంబ అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు చెప్పారు.

పెమ్మసాని పర్యటన వాయిదా

తెనాలి(కొత్తపేట): కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ 3న తెనాలి జిల్లా ఆసుపత్రికి వచ్చే కార్యక్రమం ఐదో తేదీకి వాయిదా పడింది. ఆ రోజు నిర్వహించే ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొననున్నారు.

తెనాలి

•తెనాలి •పొన్నూరు

కొత్త మున్సిపల్ భవన నిర్మాణానికి అడుగులు

తెనాలి(కొత్తపేట) న్యూస్‌టుడే: సుమారు 6 దశాబ్దాల కిందట నిర్మించిన తెనాలి పురపాలక సంఘం కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరింది. ఎట్టకేలకు అధికారులు దీనికి బదులు కొత్తది నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో నూతన భవనానికి రూ.15కోట్లతో అంచనాలు తయారు చేయించి ప్రభుత్వం



శిథిలావస్థలో భవనం

నుంచి పరిపాలనా ఆమోదం తీసుకున్నారు. వర్షాలు కురిసినప్పుడు ఈ భవనం శ్లాబు నుంచి నీరు కారుతుండడంతో అధికారులు ఉద్యోగులు విధులు నిర్వహించడానికి తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ భవనానికి ఎదురుగా ఉన్న కూరగాయల మార్కెట్ భవనం కాంప్లెక్స్‌లోని 3, 4 అంతస్తుల్లో పురపాలిక కార్యాలయాన్ని నడపాలని, దానిలో మార్పులు చేర్పులకు అయ్యే సుమారు రూ.40 లక్షలు ఖర్చుకు ఇటీవల కౌన్సిల్ ఆమోదం తీసుకున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో రైతుల ఖాతాల్లో నగదు జమ బటన్ నొక్కేందుకు తెనాలి వచ్చిన సీఎం జగన్ దృష్టికి అప్పటి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ శిథిల మున్సిపల్ కార్యాలయ భవనం గురించి తీసుకెళ్లారు. ఆయన స్పందించి కొత్తది నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కానీ మంజూరు చేసింది లేదు. సీడీఎంఏ(కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపాలిటీ) తెనాలి వచ్చినప్పుడు అప్పటి మున్సిపల్ ఇంజినీరు కొడాలి నాగమల్లేశ్వరరావు శిథిల మున్సిపల్ కార్యాలయ భవనం గురించి ఆయనకు వివరించారు. ఆయన తెనాలి పురపాలిక సంఘానికి ఏటా వివిధ పన్నులు, అద్దెలు తదితరాల రూపంలో సుమారు రూ.40 కోట్లు ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. రూ.10 కోట్లతో మున్సిపల్ స్థలంలో అధునాతన భవనం నిర్మించుకోవచ్చని అప్పటి కమిషనర్ ఎం.జస్వంతరావుకు సూచించారు. కానీ సదరు కమిషనర్ ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కానీ శ్లాబు నుంచి కారుతున్న భవనంలో ప్రజాప్రతినిధుల ఛాంబర్లు, అధికారుల గదులను రూ.లక్షల సొంత నిధులతో ఆధునీకరించడం గమనార్హం.

కార్మికులకు అండగా కూటమి ప్రభుత్వం



చేబ్రోలు: పారిశుద్ధ్య కార్మికులను సత్కరిస్తున్న రామరాజు



పొన్నూరు: కార్మికులకు దుస్తులను పంపిణీ చేస్తున్న కమిషనర్ రమేష్‌బాబు

పొన్నూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికులకు అండగా ఉంటుందని కమిషనర్ ముప్పాళ్ల రమేషబాబు పేర్కొన్నారు. బుధవారం పొన్నూరు పురపాలక సంఘంలో స్వచ్ఛతే సేవ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విజయవాడ వరద ప్రభావిత ప్రాంతంలో విధులు నిర్వహించిన 50 మంది కార్మికులకు ప్రభుత్వం దుస్తులు పంపిణీ చేసిందన్నారు.

చేబ్రోలు, న్యూస్‌టుడే: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమీపంలో ఘన వ్యర్థాల కేంద్రం వద్ద స్వచ్ఛతే సేవ ముగింపు ఉత్సవాలు నిర్వహించారు. ఎంపీడీవో లలిత మాట్లాడుతూ మండలంలో అన్ని ఘన వ్యర్థాల కేంద్రాలు పునః ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. సర్పంచి వినీ తారాణి, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, తెదేపా నాయకుడు రామరాజు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతే సేవకు మేము సైతం..

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: స్వచ్ఛతలో మేము సైతం అంటూ ఎస్‌బీఐ అధికారులు, సిబ్బంది బుధవారం పట్టణ చినరావూరు పార్కు శుభ్రత పనుల్లో భాగస్వాములయ్యారు. వ్యర్థాలను తొలగించారు. ప్రాంతీయ అధికారి జగదీష్‌కుమార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



శుభ్రత పనుల్లో బ్యాంకు అధికారులు, ఉద్యోగులు

రూ.40 లక్షల ప్రజాధనం వృథా!

ఆక్రమణల తొలగింపు సాకుతో పేవర్స్ రోడ్లకు మంగళం
వైకాపా మున్సిపల్ పాలకవర్గ నిర్వాకం

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే

గత తెదేపా ప్రభుత్వ హయాం(2014-19)లో ప్రజల సౌలభ్యం కోసం మహానగరాల్లో మాదిరిగా తెనాలి పట్టణంలో వివిధ ప్రాంతాల్లో ప్రధాన సిమెంటు రోడ్లు, మురుగు కాలువల మధ్య సుమారు రూ.కోటి వెచ్చించి వినూత్నంగా నిర్మించిన పేవర్స్ రహదారులకు ప్రస్తుత వైకాపా మున్సిపల్ పాలకవర్గం మంగళం పాడింది. ఆక్రమణల సాకు చూపి పేవర్స్‌ను తొలగించి వాటి స్థానంలో సుమారు రూ.40 లక్షలు వ్యయం చేసి సిమెంట్ రోడ్లు నిర్మించాలని నిర్ణయించింది. వీటిలో ఇప్పటికే ఒకదానిని తొలగించి సిమెంటు రోడ్డు వేసేందుకు రంగం సిద్ధం చేసింది. దీంతో గతంలో తెదేపా హయాంలో పేవర్స్ కోసం వెచ్చించిన ప్రజాధనం భారీగా వృథా అయ్యే పరిస్థితి ఏర్పడింది. మరోపక్క వైకాపా పాలకవర్గం తీసుకున్న నిర్ణయంపై పట్టణ వాసుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

తెదేపా హయాంలో సౌలభ్యంగా..

2014-19 మధ్య తెదేపా హయాంలో పట్టణంలో బోసురోడ్డు, చినరావూరు పార్కు, టీబీ రోడ్డు నిర్మాణంలో భాగంగా సిమెంటు రోడ్లు కాలువలకు మధ్య భాగంలో పేవర్స్ ఏర్పాటు చేశారు. ఇవి పాదచారులు నడవడానికి ఎంతో సౌలభ్యంగా ఉండడంతో పాటు ట్రాఫిక్ రద్దీ తగ్గుతుంది. మరోపక్క ప్రమాదాలకు తావుండదు. ఇప్పటికే ఇలాంటివి విజయవాడ, గుంటూరు, వైజాగ్ వంటి నగరాల్లో కూడా వేశారు. ఇవి దెబ్బతింటే అంతవరకే తొలగించి కొత్తవి వేసుకోవచ్చు. కానీ వైకాపా పాలకవర్గం వీటిని పట్టించుకోలేదు.



బోసు రోడ్డులో పేవర్స్‌తో నిర్మించిన రహదారి

600 మీటర్లలో సీసీ రోడ్ల నిర్మాణం

మున్సిపల్ అధికారులు పేవర్స్‌పై అక్రమ నిర్మాణాలు జరుపుతున్నప్పుడు అడ్డుకోలేదు. ఇటీవల బోసు రోడ్డులోని సత్యనారాయణ టాకీస్ రోడ్డు నుంచి చిట్టిఆంజనేయస్వామి గుడి వరకు అక్రమ నిర్మాణాల తొలగింపు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా అవి కాస్త దెబ్బతిన్నాయి. వీటిని, అక్రమ నిర్మాణాలను సాకుగా చూపి పేవర్స్ వేసిన స్థలంలోనూ, మరికొద్ది దూరం కొత్త సిమెంటు రోడ్డు వేసేందుకని కౌన్సిల్‌లో పెట్టి ఆమోదం తీసుకున్నారు. మున్సిపల్ ఇంజినీర్లు, సత్యనారాయణ టాకీస్ రోడ్డు నుంచి సీతాంబ హోటల్ వరకు వేసిన 60 అడుగుల సీసీ రోడ్డుకు, మురుగు కాలువలకు మధ్య సుమారు 600 మీటర్ల పొడవులో సుమారు 400 మీటర్ల దూరం, చిట్టి ఆంజనేయస్వామి ఆలయం వరకు రూ.40 లక్షలతో పేవర్స్ వేశారు. వీటిని తొలగించిన స్థలం, మరి కొద్ది దూరం కలిపి సుమారు 40 లక్షలతో సీసీ రోడ్డు వేయించి, అనధికార కట్టడాలు నిర్మించకుండా అడ్డుకుంటామని అధికారులు పేర్కొనడం గమనార్హం.

★ **కౌన్సిల్ ఆమోదం:** ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బోసు రోడ్డులోని సత్యనారాయణ టాకీస్ రోడ్డు నుంచి చిట్టి ఆంజనేయస్వామి వరకు కాలువ, రోడ్డు మధ్య పేవర్స్ దెబ్బతినడంతో తొలగించి సీసీ రోడ్డు వేసేందుకు టెండర్ పిలిచి గుత్తేదారును ఎంపిక చేసినట్లు ఎంఈ ఎ.శ్రీనివాసరావు పేర్కొన్నారు. మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం మేరకు ఆ పనులు చేపట్టినట్లు ఆయన వివరించారు.



ఇటీవల ఆక్రమణల తొలగింపు వల్ల దెబ్బతిన్నాయి ఇలా..

రాకపోకలెలా?



ఉప్పుబజారుకు వచ్చే రోడ్డు మధ్యలో భవన వ్యర్థాలు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: పట్టణ షరాబజార్‌లోని కూడలి నుంచి ఉప్పుబజార్‌కు వెళ్లే రోడ్డులో తొలగించిన ఇంటి వ్యర్థాలు అడ్డుగా పోశారు. రాకపోకలకు అవకాశం లేక వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడ్డారు. ఆ వ్యర్థాలు తొలగించాలని ఆదేశించినట్టు టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సుధాకర్ బుధవారం తెలిపారు.

వైభవం.. శ్రీవారి కల్యాణం

తాడేపల్లి, న్యూస్‌టుడే: సీతానగరం కొండపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాన్ని బుధవారం అత్యంత వేడుకగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు సుదర్శనహోమం, అష్టోత్తర శతనామార్చన జరిపించారు. అనంతరం పద్మావతిదేవి అమ్మవారికి తిరుమంజనసేవ నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఉత్సాహంగా తైక్వాండో పోటీలు



స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక క్రీడా మైదానంలో మంగళవారం నిర్వహించిన తైక్వాండో పోటీలు ఉత్సాహంగా సాగాయి. జిల్లా స్థాయి విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. నిర్వాహక ప్రతినిధులు పర్యవేక్షించారు. ఈ పోటీల్లో తమ విద్యార్థులు అభిరామ్, వెంకటనాగమణికంఠ బంగారు పతకాలు సాధించినట్లు భాష్యం ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ రాము బుధవారం తెలిపారు. **- న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

సనాతన ధర్మ పరిరక్షణే జనసేన లక్ష్యం

పెదకాకాని, న్యూస్‌టుడే: సనాతన ధర్మ పరిరక్షణ కోసం జనసేన పార్టీ పని చేస్తుందని జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు తెలిపారు. తిరుపతి లడ్డూ కల్తీని నిరసిస్తూ జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా గాదె దీక్ష చేపట్టారు. బుధవారం గుంటూరు నగరంలోని బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవస్థానం నుంచి పాదయాత్రగా నంబూరులోని దశావతార వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి చేరుకొని దీక్ష విరమించారు. జనసేన నాయకులు బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, చిల్లపల్లి శ్రీనివాసరావు, పార్వతి, మాధవి, వీరెళ్ల వెంకటేశ్వరరావు, షేక్ జాకీర్‌హుస్సేన్, దూపాటి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రగా వెళ్తున్న జనసేన జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు

మహాత్మా మన్నించు!



చేబ్రోలు: ఉప్పు సత్యాగ్రహం సమయంలో గాంధీ చేబ్రోలు వచ్చారు. ఇందుకు గుర్తుగా నాటి స్వాతంత్ర్య సమరయోధులు కోనేరు పక్కన మహాత్మునికి ఆలయాన్ని ఏర్పాటు చేసి చిత్రపటం ఉంచారు. గాంధీ మరణానంతరం కొంతకాలం పూజలు నిర్వహించినా ప్రస్తుతం ఆలనా పాలనా లేక పిచ్చి చెట్లు, పొదలతో ఇలా నిండిపోయింది.

గాంధీ మార్గం అనుసరణీయం



తెనాలి: విజేతలతో ఛైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న, లక్ష్మీపతిరావు, ఆరోగ్యాధికారిణి డాక్టర్ నిర్మల



అంజలి ఘటిస్తున్న సబ్‌కలెక్టర్ సంజన



మార్కెట్ సెంటర్‌లో..



తెదేపా కార్యాలయంలో..



గాంధీచౌక్‌లో విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్

న్యూస్‌టుడే బృందం: తెనాలి, పొన్నూరు నియోజకవర్గాల్లో గాంధీ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థల్లో బాపూజీ చిత్రపటాలకు నివాళులర్పించారు. వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ మహాత్ముని అడుగుజాడల్లో నడుస్తామని ప్రతినబూనారు. తెనాలి పురపాలక సంఘ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్నలు ప్రసంగించారు. అధికారులు, సిబ్బంది, నాయకులు చీపుళ్లతో పురవీధులు శుభ్రం చేశారు. తెనాలి పట్టణంలో తెదేపా, భాజపా, జనసేన, కాంగ్రెస్, వైకాపా, ఎన్‌సీసీ క్యాడెట్ల ఆధ్వర్యంలో గాంధీ విగ్రహాల వద్ద, కార్యాలయాల్లో వేర్వేరుగా నివాళులర్పించారు. సబ్ కలెక్టర్, తహసీల్దారు కార్యాలయాల్లో వేడుకలు నిర్వహించారు. ఏఎన్‌యూలోని గాంధీజీ విగ్రహానికి, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటానికి ఉన్నతాధికారులు పూలమాలలు వేసి అంజలి సమర్పించారు. ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, ప్రిన్సిపల్స్ ఆచార్య సిద్ధయ్య పాల్గొన్నారు.



ఐతానగర్‌లో ఎన్‌సీసీ క్యాడెట్ల నివాళి



కరెవరంలో సత్కారం అందుకున్న పారిశుద్ధ్య కార్మికులు



యూటీఎఫ్ ఆధ్వర్యంలో ..



జనసేన కార్యాలయంలో..



పెదకాకాని కూడలిలో ..



పొన్నూరు తెదేపా కార్యాలయంలో..



జీబీసీ రహదారిలో భాజపా నేతలు..



పొన్నూరు పురపాలక సంఘంలో ..



విజ్ఞాన్‌లో విజేతలతో లావు రత్తయ్య



చేబ్రోలులో మండల పరిషత్ ఉద్యోగులు

గురుపీఠ పురస్కారాలతో పెరిగిన బాధ్యత



డాక్టర్ నిర్మలాదేవికి అవార్డు అందిస్తున్న డాక్టర్ దక్షిణామూర్తి, చిత్రంలో డాక్టర్ కొల్లి మోహనరావు తదితరులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి హిందీ ప్రేమీ మండలి గురుపీఠ పురస్కారాలు అందుకోవడం అదృష్టంగా భావిస్తున్నామని, ఈ గౌరవం హిందీ ప్రచారంలో మా బాధ్యతను మరింత పెంచిందని పురస్కార గ్రహీతలు డాక్టర్ కొల్లి మోహనరావు, డాక్టర్ చిట్టిళ్ల నిర్మలాదేవి పేర్కొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం బోయపాటి దంపతుల హిందీ ప్రచార గురు పీఠ పురస్కారాలను హిందీ ప్రేమీ మండలి మహా విద్యాలయం అధ్యక్షుడు డాక్టర్ దక్షిణామూర్తి వారికి అందించి ఘనంగా సత్కరించారు. విద్యాలయ ఆవరణలో జరిగిన వేడుకలో శ్రీనివాసరావు, కస్తూరి, అయినాల మల్లేశ్వరరావు తదితరులతో పాటు పలువురు విద్యావేత్తలు పాల్గొన్నారు. తొలుత గాంధీజీ శిబిర దర్శనం, జెండా ఆవిష్కరణతో వేడుకలు ప్రారంభం అయ్యాయి.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న తెనాలి డీఎస్పీ జనార్దన్‌రావు

పొన్నూరు, న్యూస్‌టుడే: చట్టలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తెనాలి డీఎస్పీ జనార్దన్ రావు పేర్కొన్నారు. బుధవారం రాత్రి మండల పరిధి ములుకుదురులో నిర్వహించిన వారధి కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ బ్యాంకు ఖాతా వివరాలు, అధార్ నెంబరు అడిగినా సమాచారం ఇవాల్సిన అవసరం లేదని, ఆ వివరాలను గోప్యంగా ఉంచుకోవాలని సూచించారు. సైబర్ నేరగాళ్లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ చెప్పమని కోరినా చెప్పవద్దని తెలిపారు. సీఐ కోటేశ్వరరావు, ఎస్సై కిరణ్‌బాబు, సంగం డెయిరీ డైరెక్టర్ బొర్రు రామారావు తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఢీ.. ఒకరి దుర్మరణం

తిరువూరు, న్యూస్‌టుడే: బస్సు ఢీ కొట్టిన ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వేజెండ్ల గ్రామానికి చెందిన సాయికృష్ణ(34) తిరువూరు బైపాస్ రోడ్డులో ఫలరసాల విక్రయ దుకాణంలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి తన ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి బయలుదేరగా మండలంలోని కాకర్ల వద్దకు రాగానే విజయవాడ నుంచి ఛత్తీస్‌ఘడ్ వెళుతున్న బస్సు ఎదురుగా వచ్చి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు అతడి భార్య వీణ ఫిర్యాదు మేరకు ఏఎస్సై ఎండీ.షరీఫ్ కేసు నమోదు చేశారు. బుధవారం మృతదేహానికి తిరువూరు ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పెదవడ్లపూడి వద్ద మంగళవారం అర్ధరాత్రి తర్వాత గుర్తుతెలియని సుమారు 30 ఏళ్ల వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతి చెందినట్లు తెనాలి రైల్వే పోలీసులు బుధవారం తెలిపారు. మృతుని వద్ద ఉన్న ఆధార్ కార్డులో అసోం రాష్ట్రం అని ఉందని, దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

రేషన్ బియ్యం స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం బస్తాలు

తెనాలి టౌన్: తెనాలి మీదుగా ఫిరంగిపురం వెళుతున్న రేషన్ బియ్యాన్ని తెనాలి గ్రామీణ పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు బుధవారం తెలిపిన సమాచారం మేరకు.. మంగళవారం రాత్రి రేషన్ బియ్యం తరలిపోతున్నాయన్న సమాచారంతో పోలీసులు తెనాలి మండలం పెదరావూరు వద్ద తనిఖీలు నిర్వహించి 50 కేజీలున్న 100 బస్తాలను, కొలకలూరు వద్ద మరో 50 బస్తాలతో వెళుతున్న లారీలను పట్టుకున్నారు. లారీలు, సరకు సీజ్ చేసి ఫిరంగిపురం ప్రాంతానికి చెందిన ఇరువురు డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. కొలకలూరు సమీపంలో తాను బియ్యం లారీలో ఎక్కించినట్లు అక్కడ పట్టుబడిన డ్రైవర్ పోలీసులకు చెప్పగా, కొల్లూరు సమీపం నుంచి తాను బియ్యం లారీలో చేర్చినట్లు పెదరావూరు వద్ద పట్టుబడిన డ్రైవర్ తెలిపాడు. బియ్యం సేకరించినది ఎవరు? ఫిరంగిపురంలో ఎక్కడకు వెళుతోంది తదితర వివరాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

స్క్రూడ్రైవర్‌తో దాడి



గాయపడిన గురులింగం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: బహిరంగ మద్యపానం వద్దన్నందుకు వ్యక్తిపై స్క్రూడ్రైవర్‌తో దాడి చేసిన ఘటన తెనాలి పట్టణ యడ్లలింగయ్య కాలనీలో చోటుచేసుకుంది. మూడో పట్టణ పోలీసులు బుధవారం తెలిపిన సమాచారం మేరకు.. కాలనీకి చెందిన గురులింగం పట్టణంలో పని ముగించుకుని అర్ధరాత్రి తర్వాత ఇంటికి చేరుతూ ఉండగా బంధువైన సాయి కుమార్ తన మిత్రులతో కలిసి బహిరంగంగా మద్యపానం చేస్తున్నాడు. ఈ సమయంలో ఇలా రోడ్డుపై తాగడం ఏమిటి? అంటూ గురులింగం ప్రశ్నించాడు. గతంలో జరిగిన పాత గొడవలను కూడా మనసులో పెట్టుకుని సాయికుమార్ తన పక్కనే పడి ఉన్న స్క్రూడ్రైవర్‌తో గురులింగంపై దాడి చేశాడు. గాయపడిన గురులింగంను బంధువులు తొలుత తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ఇక్కడ ప్రాథమిక చికిత్స చేసి గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు పంపారు. బాధితుని ఆరోగ్యం నిలకడగానే ఉందని పోలీసులు వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అందరికీ అండగా ఉంటాం: మంత్రి లోకేశ్

తాడేపల్లి, న్యూస్‌టుడే: ప్రజాప్రభుత్వం ప్రతి ఒక్కరికీ అండగా ఉంటుందని విద్య, ఐటీ శాఖల మంత్రి, మంగళగిరి శాసనసభ్యులు నారా లోకేశ్ అన్నారు. ఉండవల్లి నివాసంలో బుధవారం ఆయన ప్రజా దర్బార్ నిర్వహించిన ప్రజల నుంచి నేరుగా సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఉద్యోగం పేరుతో రూ.లక్షలు వసూలు చేసి మోసం చేసిన కురగంటి జాన్‌పై చర్యలు తీసుకోవాలని తాడేపల్లికి చెందిన జ్యోతుల మహేష్‌బాబు వినతిపత్రం అందజేశారు. తీసుకున్న నగదు తిరిగి చెల్లించాలని కోరితే దాడులకు పాల్పడుతున్నారని వాపోయారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటానని మంత్రి భరోసా ఇచ్చారు. చేనేత వృత్తి చేస్తూ జీవనం సాగించే తమ మగ్గం దెబ్బతిని నష్టపోయానని పరిహారమిచ్చి ఆదుకోవాలని కోరారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి రెండు కాళ్లు పోగొట్టుకున్న తనకు దివ్యాంగ పింఛన్ మంజూరు చేయాలని మంగళగిరికి చెందిన వలవీటి ఉష కోరారు. దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న తన కుమారుడికి పింఛన్ మంజూరు చేయించాలని తాడేపల్లి మహానాడుకు చెందిన వీరంద్రరెడ్డి మంత్రికి అర్జీలు ఇచ్చారు.

గుంటూరు తూర్పు

ప్రణాళికా విభాగం ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: గ్రీన్‌గ్రేస్ అపార్టుమెంట్‌కు రైల్వేశాఖ ఇచ్చిన ఎన్‌వోసీ రద్దయినా దాని అమలుపై నిర్లక్ష్యంతో వ్యవహరించిన ప్రణాళికా విభాగం సూపరింటెండెంట్, గుమస్తాలకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు కమిషనర్ పి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రీన్‌గ్రేస్ నిర్మాణాలపై వచ్చిన ఫిర్యాదులు, కథనాలపై ప్రాథమిక స్థాయిలో సీపీ నేతృత్వంలో విచారణ చేశారని, ఆ నివేదిక మేరకు తాను క్షేత్ర స్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించామని తెలిపారు. పట్టణ ప్రణాళికా అధికారుల నివేదిక మేరకు రైల్వేశాఖ 2023 మే 25న జారీ చేసిన ఎన్‌వోసీని రద్దు చేస్తున్నట్లు జీఎంసీకి లేఖ పంపిందన్నారు. లేఖ అప్పటి సిటీప్లానర్ ద్వారా సంబంధిత విభాగం సూపరింటెండెంట్ పోలేశ్వరరావు, గుమస్తా నారాయణమూర్తి ద్వారా టీపీఎస్‌కు పంపినట్లు తెలిపారు. కానీ అక్కడి నుంచి ఎటువంటి చర్యలు లేకుండా పెండింగ్‌లో ఉంచారన్నారు. లేఖపై స్పందించని అధికారుల అలసత్వంపై చర్యలు తీసుకోవడానికి ఉన్నతాధికారులు, కమిషనర్‌కు సిఫార్సు చేయని కారణంగా నాటి విభాగ సూపరింటెండెంట్, గుమస్తాలకు షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. గ్రీన్‌గ్రేస్ అపార్టుమెంట్‌కు 2015లో ఇచ్చిన అనుమతులు, తర్వాత నిర్మాణ పర్యవేక్షణ లోపంపై ఇప్పటి వరకు చేసిన 16 మంది ప్రణాళికా అధికారులకు కూడా షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు.

అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు

పట్నంబజారు: ఈ నెల 17న పౌర్ణమి సందర్భంగా అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేస్తున్నట్లు గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్ సలాం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ రాత్రి 9.15గంటలకు గుంటూరు బస్టాండు నుంచి బయలుదేరి 16వ తేదీ శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్ టెంపుల్ దర్శించుకొని, అదేరోజు రాత్రి అక్కడి నుంచి బయలుదేరి 17వ తేదీ ఉదయం అరుణాచలానికి చేరుకుంటుందని పేర్కొన్నారు. 18వ తేదీ ఉదయం 6.30గంటలకు తిరిగి గుంటూరు బస్టాండుకు చేరుకుంటుందని తెలిపారు. టిక్కెట్ ధర రూ.2,420గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు..

అడ్డుకునేదెవరు?

రద్దీ రహదారుల్లో ఆక్రమణల జోరు ★ జోన్ల ఏర్పాటులో తీవ్రజాప్యం

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే

నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారులు, కూడళ్లలో ఆక్రమణల జోరుకు అడ్డు లేకుండాపోతోంది. ఇవి కళ్లముందు కనపడుతున్నా పట్టణ ప్రణాళికాధికారులు పట్టించుకోకుండా వదిలేశారు. గత నెలలో ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నట్లు ప్రకటించినా అది కేవలం రెండు రోజులకే పరిమితం చేశారు. ఆ రెండు రోజుల్లో రహదారి అంచుల్లో తొలగించిన ఆక్రమణలు సైతం మళ్లీ వెలుస్తున్నాయి. దీనికితోడు మార్జిన్‌లు ఆక్రమణలతో రహదారులు కుంచించుకుపోయి ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయి. మరో వైపు వెండార్ జోన్లు ఏర్పాటు చేస్తామని అధికారులు ఏళ్లుగా చెబుతున్నా క్షేత్ర స్థాయిలో అమలు చేయడం లేదు. రెడ్, గ్రీన్, అంబర్ జోన్‌లుగా పలు ప్రాంతాలను గుర్తించి గతంలో అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. కానీ క్షేత్ర స్థాయిలో మాత్రం మార్కింగ్, హాకర్లు ఎంత మంది ఉన్నారు? వారికి ఎలా లైసెన్సులు ఇవ్వాలనే అంశాలు గురించి అధికారులు పట్టించుకోకుండా వదిలేస్తున్నారు.



జీజీహెచ్ ఎదుట రహదారి మార్జిన్‌లో అల్పాహార వ్యాపారాలు



చేపల మార్కెట్ రోడ్డులో పరిస్థితి

తూర్పు నియోజకవర్గంలో నగరపాలకసంస్థ కార్యాలయం చుట్టూ ఉన్న లాలాపేట, పట్నంబజారు, మార్కెట్, చేపల మార్కెట్, పల్నాడు బస్టాండ్ ప్రాంతాలు, ఆర్టీసీ బస్టాండ్, పాత బస్టాండ్, కొత్తపేట ఓల్డ్ క్లబ్ రోడ్డు, గుంటూరువారితోట ప్రధాన రోడ్డు, నాజ్ కూడలి, పశ్చిమంలో అరండల్‌పేట, బ్రాడీపేట, లక్ష్మీపురం, కొరిటెపాడు, బృందావన్‌గార్డెన్స్, గుజ్జనగుండ్ల, అమరావతి రోడ్డు తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులతో వాహనాలు నానా అవస్థలు పడుతున్నారు. ఇటీవల పట్టణ ప్రణాళిక అధికారులు కార్యాచరణ అంటూ రెండు రోజులు హడావుడి చేసి కాల్వలు, రహదారులపై ఆక్రమణలు తొలగించారు. తర్వాత మళ్లీ వదిలేశారు.

ప్రణాళికాధికారులదే కీలకపాత్ర

వెండార్ జోన్ల ఏర్పాటులో పట్టణ ప్రణాళికాధికారులదే కీలపాత్ర. జోన్‌ల వారీగా ప్రాంతాలు గుర్తించాక మార్కింగ్ ఇవ్వడంతోపాటు హాకర్‌లకు వ్యాపారాలు చేసుకునేందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలి. గతంలో కంకరగుంట కృష్ణ ఆశ్రమం వద్ద, రింగురోడ్డు డాన్‌బాస్కో, పాతబస్టాండ్ ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా జోన్‌లు ఏర్పాటు చేసి మార్కింగ్ ఇచ్చి నిర్వహించారు. తర్వాత వీటిపై రాజకీయ నాయకుల ఒత్తిళ్లు, అధికారం ఉపయోగించి తమవారికి దుకాణాలు ఇప్పించుకోవడం, దుకాణదారుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడడం వంటి వాటితో ఈ ప్రక్రియ అప్పట్లో ఆగింది. తర్వాత వెండర్ జోన్‌ల గురించే పట్టించుకోకుండా వదిలేశారు. ట్రాఫిక్ సమస్యలు దృష్టిలో ఉంచుకుని అధికారులు ఇప్పటికైనా ప్రక్రియ వేగవంతం చేసి ఆక్రమణలు పూర్తిగా తొలగించి, వెండర్ జోన్‌లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ధర్నా జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సీహెచ్ బాబూరావు, పక్కన రామారావు, రవి

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: ఇసుక అందుబాటులో లేక భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. బుధవారం బ్రాడీపేటలోని కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. బాబూరావు మాట్లాడుతూ ఇసుక విధానంలో గత ప్రభుత్వానికి ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి తేడా లేదన్నారు. ఇసుక బుకింగ్ ఆన్‌లైన్ విధానం పెట్టినా ఆచరణలో ఇసుక పేదలకు అందడం లేదన్నారు. ఈ స్థితిలో ఈ నెల 4వ తేదీన సీపీఎం ఆధ్వర్యంలో జరిగే ధర్నా, నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి పాశం రామారావు నాయకులు రవి, నేతాజీ, అప్పారావు, భావన్నారాయణ, చెంగయ్య, వెంకటరెడ్డి, వెంకటేశ్వరరావు, కోటేశ్వరమ్మ, చిష్టి పాల్గొన్నారు.

మద్యం నియంత్రించాలని నిరసన



ప్రదర్శనలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు అరుణ, నాయకులు పద్మ, రమణ, కల్యాణి, కృష్ణకుమారి, షకీల

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: మద్యం నియంత్రణకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ డిమాండ్ చేశారు. బుధవారం ఐద్వా, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శంకర్ విలాస్ కూడలిలో నిరసన తెలిపారు. అరుణ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన మద్యం పాలసీని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. మద్యం దుకాణాలు తగ్గించాలని డిమాండ్ చేశారు. గుడి, బడి, నివాస ప్రాంతాల్లో షాపులకు అనుమతివ్వడం సరికాదన్నారు. మద్యం మత్తులో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, అఘాయిత్యాలను చూస్తూ ఉన్నారు తప్ప.. అడ్డుకోలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి పీహెచ్‌సీల్లో డీఎడెక్షన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. నాయకులు పద్మ, రమణ, కల్యాణి, కృష్ణకుమారి, షకీల, ఖాసిం షహీద్, కిరణ్, సమీర్, యశ్వంత్, సుచరిత పాల్గొన్నారు.

మహనీయుల త్యాగాలు మరువలేం



పోలీసు కార్యాలయంలో గాంధీ విగ్రహానికి సెల్యూట్ చేస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్



ఆర్టీసీ కాలనీలోని సెయింట్ లారెల్స్ స్కూల్‌లో ..



కొత్తపేట పోలీసుస్టేషన్‌లో సీఐ వీరయ్య, సిబ్బంది



వీఎస్ఆర్ పాఠశాలలో అప్సా రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు



మాట్లాడుతున్న జిల్లా జడ్జి పార్థసారథి, వేదికపై జడ్జి లీలావతి, ఎస్పీ సతీష్‌కుమార్, జైలు పర్యవేక్షకులు రఘు



జీఎంసీ కార్యాలయంలో మేయర్ శివనాగ మనోహ ర్‌నాయుడు, కమిషనర్ శ్రీనివాసులు తదితరులు



జిన్నాటవర్ వద్ద ఎమ్మెల్సీ లక్ష్మణరావు, లక్ష్మణరెడ్డి తదితరులు



ఛాంబర్ కార్యాలయంలో...



హిమనిసెంటర్: మోదీ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ వినతిపత్రం చూపుతున్న కాంగ్రెస్ నాయకులు

గుంటూరు తూర్పులో మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రిల జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థల్లో బాపూజీ చిత్రపటానికి పూలదండలు వేసి ఘన నివాళులర్పించారు. అధికారులు, ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుల త్యాగాలు ఎనలేనివని పేర్కొన్నారు. గుంటూరు పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ సతీష్‌కుమార్ జాతిపిత విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. జిల్లా జైలులో జరిగిన ఖైదీల సంక్షేమ దినోత్సవంలో జడ్జి పార్థసారథి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి లీలావతి, ఎస్పీ సతీష్‌కుమార్, జైలు పర్యవేక్షకులు రఘులు మాట్లాడారు. ఇక్కడ ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ☛ హిమనీ కూడలిలోని ఆయన విగ్రహానికి కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నూతన స్వీపింగ్ మిషన్‌లను మంత్రి ప్రారంభించారు. తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు మహమ్మద్ నసీర్, గళ్లా మాధవి, డిప్యూటీ కమిషనర్ సజీల, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే బృందం



జైన్ హైస్కూల్‌లో..




చలమయ్య కళాశాలలో..



భాజపా కార్యాలయంలో నాయకులు..



టీజేపీఎస్ కళాశాలలో..



ఎన్జీవో కాలనీ సుమేధ హైస్కూల్‌లో..



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కిరణ్, సమీర్, యశంత్

కళాశాలలపై చర్యలు తీసుకోండి

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: గాంధీ జయంతి రోజు తరగతులు నిర్వహించిన కళాశాలలపై చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ డిమాండ్ చేశారు. బుధవారం బ్రాడీపేటలోని కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్థానిక విద్యాశాఖాధికారుల నిర్లక్ష్యం కారణంగా గుంటూరు నగరంతోపాటు జిల్లా వ్యాప్తంగా పలు కళాశాలలు బుధవారం సెలవు అయినా తరగతులు నిర్వహించాయన్నారు. ఈ నెల 3వ తేదీ నుంచి దసరా సెలవులుగా ప్రభుత్వం ప్రకటిస్తే పాఠశాలలు, కళాశాలలు మాత్రం విద్యార్థులకు తరగతులకు హాజరవ్వాలని ఆదేశిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. జిల్లా అధ్యక్షుడు సమీర్, ఉపాధ్యక్షుడు యశ్వంత్ పాల్గొన్నారు.

సేవలకు గుర్తింపు



జ్ఞాపిక స్వీకరిస్తున్న సభ్యుడు అల్లాభక్షు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: అనాథ శవాలను దహనం చేయడం, వృద్ధులు, పేదలకు సహాయం చేస్తున్న గుంటూరు కొవిడ్ ఫైటర్స్ ఛారిటబుల్ ట్రస్టు సభ్యులకు బుధవారం జిల్లా జైలులో జరిగిన ఖైదీల సంక్షేమ దినోత్సవం సందర్భంగా జిల్లా జడ్జి పార్థసారథి, జడ్జి లీలావతి, ఎస్పీ సతీష్‌కుమార్, జైలు పర్యవేక్షకులు రఘు జ్ఞాపికను అందించి ప్రశంసించారు.

వృద్ధులకు అన్నదానం

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: వృద్ధులకు సీఆర్ఆర్ మూర్తి సేవా సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని కమిషనర్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం పాత గుంటూరు యాదవుల బజారులో వృద్ధాశ్రమాన్ని ఆయన సందర్శించారు. అక్కడ వారికి ఆహారం అందించి బాగోగులు అడిగి తెలుసుకున్నారు.

‘నాటి వైకాపా పాపాలే నేడు రాష్ట్రానికి శాపాలు’

పట్టాభిపురం, న్యూస్‌టుడే: గత అయిదేళ్ల వైకాపా పాలనలో జగన్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ విమర్శించారు. గుంటూరులో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ‘రూ.10 లక్షల కోట్ల వరకు అప్పులు చేసి.. దారి మళ్లించి రాష్ట్ర ఖజానాను ఖాళీ చేశారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటీ అమలు చేస్తున్నారు. ఇది చూసి ఓర్వలేక వైకాపా నేతలు బురద జల్లుతున్నారు’.. అని ధ్వజమెత్తారు.

మద్యం విక్రేత అరెస్టు

గుంటూరు నేరవార్తలు: గాంధీజయంతి రోజు నగరంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. కొత్తపేటకు చెందిన బి.రమేష్ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో అధిక ధరకు మద్యం విక్రయిస్తున్నాడని పోలీసులకు సమాచారం అందింది. సీఐ వీరయ్య, ఎస్సై డి.రమేష్ సిబ్బందితో కలిసి వెళ్లి బస్టాండ్ ఎదురుగా పెట్రోలు బంకు వద్ద మద్యం విక్రయాలు నిర్వహిస్తున్న అతన్ని అరెస్టు చేశారు. అతని నుంచి 12 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.


బాలలకు ప్రకృతి పాఠాలు



మొక్కను నాటుతున్న మంగాదేవి, నరేంద్రరెడ్డి, తారకనాథ్, మల్లేశ్వరరెడ్డి తదితరులు

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: పరిసరాల అభివృద్ధి, చెట్ల పెంపకంపై చిన్నతనం నుంచే శ్రద్ధాశక్తులు పెంచాల్సిన బాధ్యత మనందరిపై ఉందని శ్రీవేంకటేశ్వర బాలకుటీర్ విద్యా సంస్థల వ్యవస్థాపకురాలు మంగాదేవి సూచించారు. గాంధీ జయంతి సందర్భంగా ఎవర్‌గ్రీన్ ఎర్త్ ఫౌండేషన్, సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు, ఉన్నతి ఫౌండేషన్ సంయుక్తంగా బుధవారం శ్యామలానగర్ ప్రాంతంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉన్నతి ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి మాట్లాడుతూ అయిదేళ్లలో నాలుగు కిలోమీటర్ల మేర మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో వైద్యులు దీప్తిరెడ్డి, తారకనాథ్, అమర్‌నాథ్, రామకుమార్, ఐఎంఏ నగర శాఖ కార్యదర్శి సాయికృష్ణ, బీఎంఆర్ గ్రూప్ ఛైర్మన్ బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి, ఆక్స్‌ఫర్డ్ విద్యా సంస్థల డైరెక్టర్ విజయభాస్కరరెడ్డి, డీన్ కందిమల్ల సాంబశివరావు, ఉడుముల శ్రీనివాసరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

వందసార్లు రక్తదానం



రక్తదానం చేస్తున్న ఉమామహేశ్వరరావు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: వంద సార్లు రక్తదానం చేసిన ఉమామహేశ్వరరావు అందరికీ స్ఫూర్తిప్రదాత అని రెడ్‌క్రాస్ జిల్లా వైస్ ఛైర్మన్ పి.రామచంద్రరాజు అన్నారు. గుంటూరు నగరానికి చెందిన మిర్చి వ్యాపారి పోలిరెడ్డి ఉమామహేశ్వరరావు 40 ఏళ్లుగా రక్తదానం చేస్తూ అనేక మంది ప్రాణాలు కాపాడారని, కొవిడ్ సమయంలో రెడ్‌క్రాస్ వాలంటీర్‌గా అనేక సేవా కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారని తెలిపారు. భారతదేశ వ్యాప్తంగా అతికొద్ది మాత్రమే వందసార్లు చేయగలిగారని, గుంటూరు నగరానికి చెందిన వ్యక్తి ఈ రికార్డు సాధించడం చాలా గర్వకారణమని పేర్కొన్నారు. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రక్తం అందుబాటులో లేక ఎవరూ ఇబ్బంది పడకూడదన్న లక్ష్యంతో నిరంతరం రక్తదానం చేస్తున్నానన్నారు. తన మిత్ర బృందం ద్వారా కూడా రక్తదానం చేయిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా బుధవారం మరోసారి రక్తదానం చేసిన ఉమామహేశ్వరరావును రెడ్‌క్రాస్ వైస్ ఛైర్మన్ పి.రామచంద్రరాజు సన్మానించారు.



వాకథాన్‌లో పాల్గొన్న సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు, ఉద్యోగులు

స్వచ్ఛతా వాకథాన్

కలెక్టరేట్(గుంటూరు): స్వచ్ఛతా హీ సేవ 2024, విజిలెన్స్ అవేర్‌నెస్ కార్యక్రమాల్లో భాగంగా సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం జీటీ రోడ్డులోని ప్రాంతీయ కార్యాలయం నుంచి వాకథాన్, బైక్ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాంతీయ హెడ్ ఇ.వెంకటేశ్వరరావు, చీఫ్ మేనేజర్లు, సమీప శాఖల సిబ్బంది, ఆర్వోలు పాల్గొన్నారు.

వైభవంగా శారదా పరమేశ్వరికి మహాభిషేకం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: స్థానిక సంపత్ నగర్ శ్రీశృంగేరీ శారదా పరమేశ్వరి దేవస్థానంలో శారదా పరమేశ్వరీ అమ్మవారికి బుధవారం వైభవంగా మహాభిషేకం జరిగింది. పంచనదుల నుంచి సేకరించిన పంచ గంగోదకం, పంచామృతాలు, వివిధ ఫల రసాలు, పసుపు, కుంకుమ, భస్మం కలిపిన పవిత్ర జలాలతో మహాభిషేకాన్ని ఆలయ గౌరవ ప్రతినిధి పోలిశెట్టి శ్రీహరిప్రసాదరావు, పోలిశెట్టి శ్యాంసుందర్ నిర్వహించారు. సాయంత్రం వేళ సుందర సుగంధ పుష్పాలతో అమ్మవారికి విశేష అలంకరణ చేసారు.

విద్యార్థులకు పోటీలు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: లక్ష్మీపురం శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం అధ్వర్యంలో విద్యార్థులకు సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు సంగీతం పోటీలు బుధవారం నిర్వహించారు. విజేతలకు త్వరలో నిర్వహించనున్న వాగ్గేయకార ఉత్సవాల్లో బహుమతి ప్రదానం చేయనున్నామని ఉపాధ్యక్షుడు గిరిజా శంకర్ తెలిపారు. న్యాయ నిర్ణేతలుగా ప్రముఖ కర్నాటక సంగీత విద్వాంసుడు మల్లాది సూరిబాబు వ్యవహరించారు. ఈ సందర్భంగా కార్యదర్శి వల్లూరి కృష్ణకిశోర్ మాట్లాడుతూ సంప్రదాయ సంగీత విశిష్టతను ప్రచారం చేయడమే లక్ష్యంగా పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమాలను కార్యవర్గ సభ్యులు సరయు, రాజ్యలక్ష్మి, ఫణి తేజ తదితరులు పర్యవేక్షించారు.

తిరుమల ఆచార సంప్రదాయాలు మంటగలిపారు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: తిరుమలలో ఆచార, సంప్రదాయాలను జగన్ పాలనలో మంటగలిపారని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు విమర్శించారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. శ్రీవారి లడ్డు ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడారు. వైకాపా హయంలో తిరుమలను వ్యాపార కేంద్రంగా మార్చి శ్రీవారి దర్శన, సేవా టిక్కెట్లను రూ.లక్షలకు అమ్ముకున్న చరిత్ర వైకాపా నేతలది కాదా’.. అని కనపర్తి ప్రశ్నించారు.

ఆక్రమణలతో రోగుల ఇబ్బందులు



ఆసుపత్రి బయట ఆక్రమణలు తొలగిస్తున్న కిరణ్‌కుమార్ తదితరులు

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: సర్వజనాసుపత్రి అత్యవసర విభాగం ప్రధాన గేటు వద్ద అసాంఘిక వ్యక్తులు తిరుగుతుండటంతో వైద్యులు, సిబ్బంది ఆందోళన చెందుతున్నారని సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ తెలిపారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం ఆసుపత్రి బయట ఆక్రమణలను తొలగించి శుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో ఆక్రమణలతో తీవ్ర ఇబ్బందిగా ఉందన్నారు. దీనివల్ల ఉద్యోగులతో పాటు రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అక్కడ వ్యర్థ పదార్థాలు వేస్తున్నందున ఎలుకలు ఆసుపత్రిలోకి వస్తున్నాయన్నారు. ముందుగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో న్యూరాలజీ విభాగం అధిపతి అరుణకుమారి, సీఎస్ఆర్ఎంవో సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉదయం తొలగింపు.. సాయంత్రానికి మళ్లీ ఏర్పాటు: సర్వజనాసుపత్రి అత్యవసర విభాగం ప్రహరీకి ఆనుకుని ఉన్న దుకాణాలను సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ బుధవారం ఉదయం స్వయంగా తొలగించి శుభ్రం చేయించారు. ఆ దుకాణదారులు తిరిగి సాయంత్రానికి వాటిని ఏర్పాటు చేయడం గమనార్హం. దీనిపై సూపరింటెండెంట్ కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు వచ్చినప్పటికీ దుకాణదారులు అక్కడ నుంచి కదల్లేదు. దీంతో నగరపాలక సంస్థ అధికారులకు తెలియజేశారు. వారు వచ్చి తొలగిస్తే అవసరమైన బందోబస్తు తాము సమకూర్చుతామని పోలీసులు చెప్పి వెళ్లిపోయారు. కార్పొరేషన్ అధికారులు ఏమాత్రం సహకరిస్తారో వేచి చూడాలి.

గుంటూరు పశ్చిమ

ప్రణాళికా విభాగం ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: గ్రీన్‌గ్రేస్ అపార్టుమెంట్‌కు రైల్వేశాఖ ఇచ్చిన ఎన్‌వోసీ రద్దయినా దాని అమలుపై నిర్లక్ష్యంతో వ్యవహరించిన ప్రణాళికా విభాగం సూపరింటెండెంట్, గుమస్తాలకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు కమిషనర్ పి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రీన్‌గ్రేస్ నిర్మాణాలపై వచ్చిన ఫిర్యాదులు, కథనాలపై ప్రాథమిక స్థాయిలో సీపీ నేతృత్వంలో విచారణ చేశారని, ఆ నివేదిక మేరకు క్షేత్ర స్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించామన్నారు. పట్టణ ప్రణాళికా అధికారుల నివేదిక మేరకు రైల్వేశాఖ 2023, మే 25న జారీ చేసిన ఎన్‌వోసీని రద్దు చేస్తున్నట్లు జీఎంసీకి లేఖ పంపిందన్నారు. లేఖ అప్పటి సిటీప్లానర్ ద్వారా విభాగం సూపరింటెండెంట్ పోలేశ్వరరావు, గుమస్తా నారాయణమూర్తి ద్వారా టీపీఎస్‌కు పంపినట్లు చెప్పారు. లేఖపై స్పందించని అధికారులపై చర్యలు తీసుకోవడానికి ఉన్నతాధికారులు, కమిషనర్‌కు సిఫార్సు చేయని కారణంగా నాటి విభాగ సూపరింటెండెంట్, గుమస్తాలకు షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. గ్రీన్‌గ్రేస్ అపార్టుమెంట్‌కు 2015లో ఇచ్చిన అనుమతులు, తర్వాత నిర్మాణ పర్యవేక్షణ లోపంపై ఇప్పటి వరకు చేసిన 16 మంది ప్రణాళికా అధికారులకు కూడా షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
97042 53525, 80085 74897

స్పందనకు వందనం

కాలువలో పూడికతీత: నగరంలోని కంకరగుంట మెయిన్ రోడ్డు వెంబడి ఉన్న డ్రెయిన్‌లో చెత్త పెరుకుపోయి మురుగు కదలడంలేదు. సమస్యను 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా జీఎంసీ శానిటరీ సూపర్‌వైజర్ సోమశేఖర్‌కు తెలిపాం. ఆయన 83 సచివాలయ శానిటరీ కార్యదర్శి సంజయ్ నాయక్‌తో సిబ్బందిని పంపించి కాలువలోని పూడిక తీయించారు.

లీకులు అరికట్టారు: హౌసింగ్‌బోర్డులోని అన్నపూర్ణ మెస్ దగ్గర మెయిన్ పైపులైను లీకవ్వడంతో రహదారిపై నీరు ప్రవహిస్తుంది. వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. సమస్యను 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా ఏఈ నాగవేణి దృష్టికి తీసుకెళ్లాం. ఆమె మేస్త్రి కుమార్‌తో సిబ్బందిని పంపించి లీకు అరికట్టేలా చర్యలు తీసుకున్నారు.
– న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం

ఇదేనా స్వచ్ఛత?

నగరంలో మెరుగుపడని పారిశుద్ధ్యం

'ప్రభుత్వం మారి 100 రోజులు దాటినా కొందరు అధికారులు మాత్రం ఇంకా ఉదాసీనంగానే వ్యవహరిస్తున్నారు. నియోజకవర్గంలో పారిశుద్ధ్య పరిస్థితి అధ్వానంగా మారింది. కాల్వలో తీసిన పూడిక రోడ్ల పక్కన కుప్పలుగా పేరుకుపోతున్నా పట్టించుకోవడంలేదు. ప్రవర్తనలో మార్పు రాకపోతే చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది'...

– డివిజన్ల పర్యటనలకు వెళ్లిన సమయంలో ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల పట్ల స్పందించిన గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి శానిటేషన్ అధికారులకు చేసిన హెచ్చరికలు ఇవి.

పట్టాభిపురం, న్యూస్‌టుడే

ఇటీవల కమిషనర్ శ్రీనివాసులు డివిజన్ల పర్యటనకు వెళ్లిన సమయంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండడం గమనించి అధికారులను మందలించారు. ఎమ్మెల్యే, కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేసినా వారి తీరులో మార్పు రావడం లేదు. ఓ వైపు గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, మహమ్మద్ నసీర్ తదితరులు ప్రభుత్వ మహిళ కళాశాల పరిసరాలను స్వయంగా ఊడ్చి శుభ్రం చేశారు. మరోవైపు నగరంలోని పలు ప్రాంతాల్లో చెత్తకుప్పలు, వ్యర్థాలు పేరుకుపోయి పారిశుద్ధ్యం క్షీణించడంతో ఇదేనా స్వచ్ఛతా హీ సేవా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.


శ్యామలనగర్ రైల్వే ట్రాక్ పక్క రోడ్డులో పూడిక తొలగించకపోవడంతో రహదారి పైకి పొంగి పొర్లుతున్న మురుగు

వ్యర్థాల కుప్పలతో జనం తిప్పలు..

ప్రధాన వీధుల్లో చెత్తకుప్పలు, వ్యర్థాల కుప్పల్ని ఎప్పటికప్పుడు తొలగించడం లేదు. ఫలితంగా రహదారులు చెత్తకూపంలా తయారవుతున్నాయి. కాల్వలో తీసిన పూడికను తొలగించకపోవడంతో వ్యర్థాలు కల్వర్టుల వద్ద పేరుకుపోయి మురుగునీరు ముందుకు సాగక పొంగిపొర్లి రోడ్లను ముంచెత్తుతోంది. వీధుల్లో పోగయ్యే చెత్త తరలిచేందుకు శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు వాహనాలు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ ఇంజినీరింగ్ విభాగం దానిపై దృష్టి పెట్టడం లేదు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నెత్తీనోరు మొత్తుకుంటున్నా వెహికల్ షెడ్ విభాగం ఇంజినీరింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇరు శాఖల మధ్య సమన్వయం కొరవడుతున్నా ఉన్నతాధికారులు అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టడం లేదు. కనీసం డివిజన్‌కు రెండు వంతున కాంపాక్టర్లు, ట్రాక్టర్లు అవసరం. మొత్తం మీద 25 ట్రాక్టర్లు, 30 కాంపాక్టర్లు ఉన్నాయని శానిటేషన్ అధికారులు పేర్కొంటున్నారు. మరోవైపు కాలం చెల్లిన వాహనాలతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని అధికారులు, డ్రైవర్లు వాపోతున్నారు.


స్తంభాలగరువు ప్రధాన రహదారిలో పేరుకుపోతున్న వ్యర్థాలు

గోడు ఆలకించరే...

డస్ట్‌బిన్లు సరిపడా లేకపోవడంతో చెత్త సేకరణకు ఇబ్బందులు పడుతున్నామని పారిశుద్ధ్య కార్మికులు చెబుతున్నారు. పుష్ కార్టులు కూడా లేవని, ముగ్గురు, నలుగురు చేయాల్సిన పనిని ఒకరితో చేయిస్తున్నారని వారు తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. ఈ-ఆటోలు ఎక్కడంటే అక్కడ మొరాయించడంతో పడరాని పాట్లు పడుతున్నామని కార్మికులు పేర్కొంటున్నారు. కనీసం చీపుర్లు కూడా ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని వాపోయారు. వాహనాలు, డస్ట్‌బిన్లతో పాటు సామాగ్రి అవసరమైన మేరకు సమకూరిస్తే పారిశుద్ధ్యం మెరుగుపర్చేందుకు అవకాశం ఉంటుందంటున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని వాహనాలు, సామాగ్రి కొరత సమస్యల్ని పరిష్కరించాల్సిన ఆవశ్యకత ఉంది.

అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు

పట్నంబజారు: ఈ నెల 17న పౌర్ణమి సందర్భంగా అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేస్తున్నట్లు గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్ సలాం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ రాత్రి 9.15గంటలకు గుంటూరు బస్టాండు నుంచి బయలుదేరి 16వ తేదీ శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్ టెంపుల్ దర్శించుకొని, అదేరోజు రాత్రి అక్కడి నుంచి బయలుదేరి 17వ తేదీ ఉదయం అరుణాచలానికి చేరుకుంటుందని పేర్కొన్నారు. 18వ తేదీ ఉదయం 6.30గంటలకు తిరిగి గుంటూరు బస్టాండుకు చేరుకుంటుందని తెలిపారు. టిక్కెట్ ధర రూ.2,420గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు..

అహింసను జీవన విధానంగా మలచుకోవాలి

జిల్లాపరిషత్తు (గుంటూరు), న్యూస్‌టుడే: గాంధీని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరు అహింసను జీవన విధానంగా మలచుకోవాలని జిల్లా యువజన సేవలు, స్టెప్ విభాగం మేనేజర్ బి.రాధిక అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని స్టెప్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సంయుక్తంగా బుధవారం నగరంలోని బి.ఆర్.స్టేడియంలో వేడుకలు నిర్వహించారు. 2కె వాక్ నిర్వహించారు.. యువత, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ నరసింహారెడ్డి, కార్పొరేటర్ మీరావలి, జిల్లా స్టెప్, డీఎస్ఏ సిబ్బంది పాల్గొన్నారు.


2కె వాక్‌లో రాధిక, నరసింహారెడ్డి, విద్యార్థులు

వైభవంగా శారదాపరమేశ్వరికి మహాభిషేకం

గుంటూరు సాంస్కృతికం: సంపత్ నగర్ శ్రీశృంగేరీ శారదా పరమేశ్వరి దేవస్థానంలో శారదా పరమేశ్వరీ అమ్మవారికి బుధవారం వైభవంగా మహాభిషేకం జరిగింది. మహాభిషేకాన్ని ఆలయ గౌరవ ప్రతినిధి పోలిశెట్టి శ్రీహరి(ప్రసాదరావు), పోలిశెట్టి శ్యాంసుందర్ నిర్వహించారు. సాయంత్రం వేళ సుందర సుగంధ పుష్పాలతో అమ్మవారికి విశేష అలంకరణ చేశారు.

బాలలకు ప్రకృతి పాఠాలు

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: పరిసరాల అభివృద్ధి, చెట్ల పెంపకంపై చిన్నతనం నుంచే శ్రద్ధ కలుగ చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని శ్రీవేంకటేశ్వర బాలకుటీర్ విద్యా సంస్థల వ్యవస్థాపకురాలు మంగాదేవి సూచించారు. గాంధీ జయంతి సందర్భంగా ఎవర్‌గ్రీన్ ఎర్త్ ఫౌండేషన్, సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు, ఉన్నతి ఫౌండేషన్ సంయుక్తంగా బుధవారం శ్యామలానగర్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉన్నతి ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి మాట్లాడుతూ అయిదేళ్లలో నాలుగు కిలోమీటర్ల మేర మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో వైద్యులు దీప్తిరెడ్డి, తారకనాథ్, అమర్‌నాథ్, రామకుమార్, ఐఎంఏ నగర శాఖ కార్యదర్శి సాయికృష్ణ, బీఎంఆర్ గ్రూప్ ఛైర్మన్ బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి, ఆక్స్‌ఫర్డ్ విద్యా సంస్థల డైరెక్టర్ విజయభాస్కర రెడ్డి, డీన్ కందిమల్ల సాంబశివరావు, ఉడుముల శ్రీనివాసరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న మంగాదేవి, నరేంద్రరెడ్డి, తారకనాథ్, మల్లేశ్వరరెడ్డి తదితరులు

స్వచ్ఛతా వాకథాన్

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవ 2024, విజిలెన్స్ అవేర్‌నెస్ కార్యక్రమాల్లో భాగంగా సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం జీటీ రోడ్డులోని ప్రాంతీయ కార్యాలయం నుంచి వాకథాన్, బైక్ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో బ్యాంకు ప్రాంతీయ హెడ్ ఇ.వెంకటేశ్వర్లు, చీఫ్ మేనేజర్, సమీప శాఖల సిబ్బంది, ఆర్బోలు పాల్గొన్నారు.



వాకథాన్‌లో పాల్గొన్న సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు, ఉద్యోగులు

ఆక్రమణలతో రోగులకు ఇబ్బందులు


ఆసుపత్రి బయట ఆక్రమణలు తొలగిస్తూ..

గుంటూరు వైద్యం: సర్వజనాసుపత్రి అత్యవసర విభాగం ప్రధాన గేటు వద్ద ఆక్రమిత వ్యక్తులు తిరుగుతుండటంతో వైద్యులు, సిబ్బంది ఆందోళన చెందుతున్నారని సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ తెలిపారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆసుపత్రి బయట ఆక్రమణలను తొలగించి శుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో ఆక్రమణలతో తీవ్ర ఇబ్బందిగా ఉందన్నారు. దీనివల్ల ఉద్యోగులతో పాటు రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అక్కడ వ్యర్థ పదార్థాలు వేస్తున్నందున ఎలుకలు ఆసుపత్రిలోకి వస్తున్నాయన్నారు. ముందుగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో న్యూరాలజీ విభాగం అధిపతి అరుణకుమారి, సీఎస్ఆర్ఎంవో సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉదయం తొలగింపు..

సాయంత్రానికి మళ్లీ ఏర్పాట్లు

సర్వజనాసుపత్రి అత్యవసర విభాగం ప్రహరీకి ఆనుకుని ఉన్న దుకాణాలను సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ బుధవారం ఉదయం స్వయంగా తొలగించి శుభ్రం చేయించారు. ఆ దుకాణదారులు తిరిగి సాయంత్రానికి వాటిని ఏర్పాటు చేయడం గమనార్హం. దీనిపై సూపరింటెండెంట్ కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు వచ్చినప్పటికీ దుకాణదారులు అక్కడ నుంచి కదల్లేదు. దీంతో నగరపాలక సంస్థ అధికారులకు తెలియజేశారు. వారు వచ్చి తొలగిస్తే అవసరమైన బందోబస్తు తాము సమకూర్చుతామని పోలీసులు చెప్పి వెళ్లిపోయారు. కార్పొరేషన్ అధికారులు ఏమాత్రం సహకరిస్తారో వేచి చూడాలి.

కష్టాలు తీరేదెప్పుడో..?



సర్వజనాసుపత్రిలో ఎకో కార్డియోగ్రామ్ పరీక్ష కోసం బుధవారం రోగులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. వారి కష్టాలు ఎప్పటికి తీరుతాయో తెలియని దుస్థితి నెలకొంది. చాలామంది స్ట్రెచర్లు, చక్రాల కుర్చీలపై వారి వంతు వచ్చేవరకు పడిగాపులు పడాల్సి వస్తోంది. కార్డియాలజీ విభాగంలో ఒకే యంత్రం ఉన్నందున అందరూ అక్కడికే రావడంతో రద్దీ ఎక్కువగా ఉంది. వారంతా ఏదో ఒక అనారోగ్య సమస్యతో ఆసుపత్రికి వస్తుంటారు. గుండె జబ్బు ఉందో. . లేదో తెలుసుకునేందుకు ఈ పరీక్ష తప్పనిసరి. దీంతో కదలలేని వారిని సైతం స్ట్రెచర్‌పై తీసుకురావాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రయివేటు ఆసుపత్రుల్లో రోగులు ఉండే పడకల వద్దకే వెళ్లి ఎకో పరీక్షలు చేస్తుండటం గమనార్హం. ఈ పరీక్ష కోసం జీజీహెచ్‌లో రోగులను ఇబ్బంది పెడుతూనే ఉన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు వైద్యులు సూచిస్తున్నారు. - **గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే**

ఎకో కార్డియోగ్రామ్ పరీక్ష కోసం చక్రాల కుర్చీలు, స్ట్రెచర్‌పై వేచి చూస్తున్న రోగులు


పరీక్ష గది వద్ద రోగుల రద్దీ

విద్యార్థులకు పోటీలు


గానాలాపన చేస్తున్న విద్యార్థులు


గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: లక్ష్మీపురం శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం అధ్వర్యంలో విద్యార్థులకు సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు సంగీతం పోటీలు బుధవారం నిర్వహించారు. విజేతలకు త్వరలో నిర్వహించనున్న వాగ్గేయకార ఉత్సవాల్లో బహుమతి ప్రదానం చేయనున్నామని ఉపాధ్యక్షుడు గిరిజాశంకర్ తెలిపారు. న్యాయ నిర్ణేతలుగా ప్రముఖ కర్నాటక సంగీత విద్వాంసుడు మల్లాది సూరిబాబు వ్యవహరించారు. ఈ సందర్భంగా కార్యదర్శి వల్లూరి కృష్ణకిశోర్ మాట్లాడుతూ సంప్రదాయ సంగీత విశిష్టతను ప్రచారం చేయడమే లక్ష్యంగా పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమాలను కార్యవర్గ సభ్యులు సరయు, రాజ్యలక్ష్మి, ఫణితేజ తదితరులు పర్యవేక్షించారు.

మహాత్ముడి సిద్ధాంతాలే మార్గదర్శనం


గాంధీ, శాస్త్రిల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన జడ్పీ ఛైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, సీఈవో, సిబ్బంది


జాతిపిత చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, తెనాలి శ్రావణ్‌కుమార్

పట్టాభిపురం, న్యూస్‌టుడే: జాతిపిత జయంతిని బుధవారం నగరంలో వాడవాడలా నిర్వహించారు. తెదేపా జిల్లా కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా పార్టీ అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్, తెదేపా నాయకులు పిల్లి మాణిక్యరావు, మద్దిరాల మ్యాని, మానుకొండ శివప్రసాద్, కంచర్ల శివరామయ్య, దామచర్ల శ్రీనివాసరావు నివాళులర్పిచారు. పెమ్మసాని మాట్లాడుతూ గాంధీజీ చెప్పినట్లుగా అందరూ చెడును అంతం చేసి మంచిని ప్రోత్సహించాలన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ అహింసతో ఏదైనా సాధించగలమని చాటి చెప్పిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. పట్టాభిపురం ప్రధాన రహదారిలో గాంధీజీ విగ్రహానికి పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, కోవెలమూడి రవీంద్ర, ఈరంటి వరప్రసాద్, కసుకుర్తి హనుమంతురావు తదితరులు నివాళులర్పించారు.


విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి, కోవెలమూడి రవీంద్ర

గోరంట్ల: బృందావన్ గార్డెన్స్‌లోని వైకాపా జిల్లా కార్యాలయంలో బుధవారం గాంధీ జయంతి సభ జరిగింది. మాజీ మంత్రి అంబటి రాంబాబు, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు గాంధీకి నివాళులర్పించారు.

గాంధీ, శాస్త్రిల సేవలు శ్లాఘనీయం

జిల్లాపరిషత్తు, న్యూస్‌టుడే: దేశ స్వాతంత్ర్య సాధన కోసం కృషి చేసిన మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రిల సేవలు శ్లాఘనీయమని జిల్లా పరిషత్తు ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. గాంధీ, శాస్త్రీ జయంతి పురస్కరించుకుని బుధవారం జడ్పీ సమావేశ మందిరంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా పరిషత్తు కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు పూలమాలలు, దుశ్శాలువాలు కప్పి సన్మానించారు. జడ్పీ సీఈవో వి.జ్యోతిబసు, డిప్యూటీ సీఈవో సీహెచ్.కృష్ణ, విభాగాల ఏవోలు, సిబ్బంది పాల్గొన్నారు. ☛ ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ పరిపాలన భవన్ లాంలో గాంధీ జయంతి నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వర్సిటీ రిజిస్ట్రార్ జి.రామచంద్రరావు, విభాగాల అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలోని ఎన్‌సీసీ క్యాడెట్లు బుధవారం ఇన్నర్ రింగ్ రోడ్డులోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అసోసియేట్ అధికారి కె.సుస్మిత, క్యాడెట్లు పాల్గొన్నారు. **-గోరంట్ల, న్యూస్‌టుడే**



రక్త దాతలు స్ఫూర్తి ప్రదాతలు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: వంద సార్లు రక్తదానం చేసిన ఉమామహేశ్వరరావు అందరికీ స్ఫూర్తిప్రదాత అని రెడ్‌క్రాస్ జిల్లా వైస్ ఛైర్మన్ పి.రామచంద్రరాజు అన్నారు. గుంటూరు నగరానికి చెందిన మిర్చి వ్యాపారి పోలిరెడ్డి ఉమామహేశ్వరరావు 40 ఏళ్లుగా రక్తదానం చేస్తూ అనేక మంది ప్రాణాలు కాపాడారని, కొవిడ్ సమయంలో రెడ్‌క్రాస్ వాలంటీర్‌గా అనేక సేవా కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారని తెలిపారు. భారతదేశ వ్యాప్తంగా అతికొద్ది మాత్రమే వందసార్లు చేయగలిగారని, గుంటూరు నగరానికి చెందిన వ్యక్తి ఈ రికార్డు సాధించడం చాలా గర్వకారణమని పేర్కొన్నారు. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రక్తం అందుబాటులో లేక ఎవరూ ఇబ్బంది పడకూడదన్న లక్ష్యంతో నిరంతరం రక్తదానం చేస్తున్నానన్నారు. తన మిత్ర బృందం ద్వారా కూడా రక్తదానం చేయిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా బుధవారం మరోసారి రక్తదానం చేసిన ఉమామహేశ్వరరావును రెడ్‌క్రాస్ వైస్ ఛైర్మన్ పి.రామచంద్రరాజు సన్మానించారు.


రక్తదానం చేస్తున్న ఉమామహేశ్వరరావు

ఠాణా అభివృద్ధికి ప్రతిపాదనలు పంపించండి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: అరండల్‌పేట ఠాణా అభివృద్ధికి ప్రతిపాదనలు పంపాలని ఎస్పీ సతీష్ కుమార్ సూచించారు. అరండల్‌పేట ఠాణాలో బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందితో మాట్లాడి వివరాలడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రతిఒక్కరూ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులు దర్యాప్తును వేగవంతం చేయాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. సివిల్ వివాదాల్లో జోక్యం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ జయరామ్, సీఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


అరండల్‌పేటలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

'నాటి వైకాపా పాపాలే నేడు రాష్ట్రానికి శాపాలు'

పట్టాభిపురం: గత అయిదేళ్ల వైకాపా పాలనలో జగన్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ విమర్శించారు. గుంటూరులో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'రూ.10 లక్షల కోట్ల వరకు అప్పులు చేసి.. దారి మళ్లించి రాష్ట్ర ఖజానాను ఖాళీ చేశారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే చంద్రబాబు రైతులకు రూ.1674 కోట్ల ధాన్యం బకాయిలు విడుదల చేశారు. ఆరోగ్యశ్రీకి జగన్ పెట్టిన బకాయిలను రూ.700 కోట్లు చెల్లించారు. సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటీ అమలు చేస్తున్నారు. ఇది చూసి ఓర్వలేక వైకాపా నేతలు బురద జల్లుతున్నారు'.. అని ధ్వజమెత్తారు.

తిరుమల ఆచార సంప్రదాయాలు మంటగలిపారు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: తిరుమలలో ఆచార, సంప్రదాయాలను జగన్ పాలనలో మంటగలిపారని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు విమర్శించారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. శ్రీవారి లడ్డు ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడారు. వైకాపా హయంలో తిరుమలను వ్యాపార కేంద్రంగా మార్చి శ్రీవారి దర్శన, సేవా టిక్కెట్లను రూ.లక్షలకు అమ్ముకున్న చరిత్ర వైకాపా నేతలది కాదా'.. అని కనపర్తి ప్రశ్నించారు.

మూడు నెలలు దాటినా.. రూ.301 కోట్లు ఇవ్వలేదు!

- వానల ముందు ప్రతిపాదనలకు.. వరదలు ముంచెత్తినా దిక్కులేదు
- జలవనరుల శాఖలో ఆగిన అత్యవసర పనులు
- ఇప్పటికీ దక్కని పాలనామోదం

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో అనేక ప్రాజెక్టులు, కాలువల అత్యవసర నిర్వహణ పనులకు రూ.301 కోట్ల నిధుల విడుదలలో జాప్యం తీవ్ర సమస్యగా మారింది. జలవనరులశాఖ నుంచి ఎప్పుడో జులైలో ఆర్థికశాఖకు వెళ్లిన ఫైలు అనేక రోజుల పెండింగ్ తర్వాత నిధులివ్వకుండా వెనక్కి వచ్చింది. మళ్లీ ఆ ఫైలును కొత్త రూపంలో తిరిగి పంపినా ఇప్పటికీ నిధుల జాడ లేదు. ప్రభుత్వంలో అత్యవసర పనులు చేపట్టేందుకు ఇలా అడ్డంకులు ఎదురైతే ఎలాగన్న ప్రశ్న తలెత్తుతోంది. గత ప్రభుత్వ హయాంలో ఆర్థికశాఖలో సకాలంలో నిధులివ్వకపోవడం వల్లే గుండ్లకమ్మ గేట్లు కొట్టుకుపోయాయి. పులిచింతల నిర్వహణ పనులకూ ఇబ్బందులు ఎదురయ్యాయి. లస్కర్ల నియామకానికి అప్పట్లో ఆర్థికశాఖ అడ్డుచక్రం వేసింది. వివిధ శాఖల్లోని అత్యవసర పరిస్థితిని ఆర్థికశాఖ గమనించకపోతే ఎన్నో సవాళ్లు ఎదురవుతాయి. తాజాగా సెప్టెంబరు నెలలో బుడమేరు పొంగింది. అక్కడ వెలగలేరు రెగ్యులేటర్ తలుపులు తెరిచేందుకు అధికారులు నానా ఇబ్బందులు పడ్డారు. ప్రాజెక్టుల అత్యవసర మెకానికల్ పనులకు రూ.56 కోట్లు ప్రతిపాదించినా సకాలంలో ఇవ్వలేదు. భారీ వరదలు, వర్షాలకు సరైన నిర్వహణ పనులు లేక ఎదురైన ఇబ్బందులు ఎన్నో. ప్రాజెక్టుల, కాలువల నిర్వహణ పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు పచ్చజెండా ఊపినా ఫైలును సకాలంలో ఆమోదించక సమస్యలు తలెత్తాయి.


తగ్గించి పంపినా..

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడగానే జలవనరులశాఖ అప్రమత్తమైంది. మంత్రి నిమ్మల రామానాయుడు, అధికారులు సాయిప్రసాద్, వెంకటేశ్వరరావు రాష్ట్రంలోని అందరు సీఈలు, ఎస్‌ఈలను పిలిపించి వరదలు, వర్షాల నేపథ్యంలో అత్యవసరంగా చేపట్టవలసిన పనుల జాబితా ఇవ్వాలని కోరారు. ప్రతి పని అవసరాన్నీ సమీక్షించారు. తొలిదశలో పెద్దమొత్తంలో ప్రతిపాదనలు వచ్చినా ఉన్నతాధికారులు అంగీకరించలేదు. ఎంతో అత్యవసరమైతేనే ప్రతిపాదించాలన్నారు. చివరకు 2,346 అత్యవసర పనులను రూ.301 కోట్లతో ప్రతిపాదించి ఆర్థికశాఖకు జూన్ చివర్లో ఫైలు పంపారు. ఇందులో ప్రాజెక్టుల అత్యవసర మరమ్మతులకు, మెకానిక్ పనులకు రూ.56 కోట్లు, వరద రక్షణ పనులకు రూ.48 కోట్లు, పూడిక తొలగింపు, కాలువల రక్షణ పనులకు రూ.93 కోట్లు, ఒప్పంద లస్కర్ల నియామకానికి రూ.29 కోట్లు, ఇతర పనులకు రూ.57 కోట్లు.. మరికొన్ని వేరే పనులు ప్రతిపాదించారు.

ఆర్థికశాఖ నుంచి వెనక్కి

చాలా రోజులు ఈ ఫైలు ఆర్థికశాఖలోనే ఉండిపోయింది. అసలు ఏ హెడ్ కింద నిధులివ్వాలని ఆర్థికశాఖ అధికారులు సందేహం వ్యక్తం చేస్తూ వదిలేశారు. జగన్ హయాంతో పాటు.. ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్ సమయంలోనూ నిర్వహణ పనులకు అవసరమైన హెడ్‌ల కింద నిధులు కేటాయించకపోవడంతో ఆ హెడ్‌ల కింద నిధుల్లేకుండా పోయాయి. చివరకు విపత్తు నిర్వహణ నిధుల కింద ఈ పనులను ప్రతిపాదించుకోవాలని ఆర్థికశాఖ ఉన్నతాధికారి ఆ ఫైలుపై సలహా ఇస్తూ వెనక్కి పంపేశారు. ఏదైనా విపత్తు సంభవిస్తే దానివల్ల నష్టపోయినవాటికి విపత్తు నిధులు ప్రతిపాదిస్తారు. ఆ పేరు చెప్పి.. అత్యవసర నిర్వహణ పనులకు నిధులు ఇవ్వకపోవడం ఏమిటన్న ప్రశ్నలు వినిపించాయి. దాంతో మళ్లీ జలవనరులశాఖ ఆ ఫైలును రెవెన్యూశాఖకు పంపి అక్కడి నుంచి విపత్తు నిధుల ప్రతిపాదనలతో మళ్లీ సమర్పించాల్సి వచ్చింది. ప్రస్తుతం ఈ ఫైలు రాష్ట్ర అత్యున్నతాధికారి వద్ద ఉన్నట్లు సమాచారం. ఇప్పటికీ ఆ పనులకు పాలనామోదం దక్కలేదు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు నేడు అంకురార్పణ



విద్యుత్తు వెలుగుల్లో శ్రీవారి ఆలయం

తిరుమల, న్యూస్‌టుడే: కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నవాహ్నిక సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధ్వజారోహణానికి ముందురోజు నిర్వహించే అంకురార్పణ కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం వేడుకగా నిర్వహించనున్నారు.

శ్రీవారి వాహన సేవల వేళలు ఇలా..

తేదీ	వారం	వాహన సేవల వేళలు
04	శుక్రవారం	ధ్వజారోహణం (సాయంత్రం 5.45- 6.00) పెద్దశేష వాహనం (రాత్రి 9-11)
05	శనివారం	చిన్నశేష వాహనం (ఉ.8-10) హంస వాహనం (రాత్రి 7-9) ★ మధ్యాహ్నం ఒంటిగంట నుంచి మూడు గంటల వరకు స్నపన తిరుమంజనం
06	ఆదివారం	సింహవాహనం (ఉ. 8-10) ముత్యపు పందిరి వాహనం (రాత్రి 7-9) ★ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు గంటల వరకు స్నపన తిరుమంజనం
07	సోమవారం	కల్పవృక్ష వాహనం (ఉ.8-10) సర్వభూపాల వాహనం (రాత్రి 7-9) ★ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు గంటల వరకు స్నపన తిరుమంజనం
08	మంగళవారం	మోహిని అవతారం (ఉ.8-10) గరుడ వాహనం (సాయంత్రం 6.30-రాత్రి 11.30)
09	బుధవారం	హనుమంత వాహనం (ఉ.8-10) గజవాహనం (రాత్రి 7-9) ★ స్వర్ణ రథోత్సవం (సాయంత్రం 4-5)
10	గురువారం	సూర్యప్రభ వాహనం (ఉ.8-10) చంద్రప్రభ వాహనం (రాత్రి 7-9)
11	శుక్రవారం	రథోత్సవం (ఉదయం7) అశ్వవాహనం (రాత్రి 7-9)
12	శనివారం	చక్రస్నానం (ఉదయం 6-9) ధ్వజావరోహణం (రాత్రి 8.30-10.30)

సత్యదేవుని ప్రసాదం కోసం విజయ నెయ్యి

అన్నవరం, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా అన్నవరం సత్యదేవుని ఆలయంలో ప్రసాదం తయారీకి వినియోగించే నెయ్యిని తాత్కాలికంగా విజయవాడలోని విజయ డెయిరీ నుంచి కొనుగోలు చేయాలని అధికారులు నిర్ణయించారు. నెయ్యి సరఫరా చేస్తున్న టెండరుదారు రైతు డెయిరీ గడువు సెప్టెంబరు 30తో ముగిసింది. అయితే ప్రస్తుతం ఆలయాల్లో వినియోగిస్తున్న నెయ్యి నాణ్యతపై చర్చ జరుగుతోంది. మరోవైపు నెయ్యి కొనుగోలుపై దేవాదాయశాఖ నుంచి ఇంకా ఎటువంటి మార్గదర్శకాలు రాలేదు. అక్టోబరు 1 నుంచి నెయ్యి సరఫరాకు టెండరు ఖరారైనా ప్రస్తుత పరిస్థితుల్లో ఇంకా అనుమతి ఇవ్వలేదు. ప్రసాదం తయారీకి నెయ్యి నిల్వలు తక్కువగా ఉన్నాయి. దీంతో తాత్కాలికంగా విజయ డెయిరీ నుంచి నెయ్యిని కొనుగోలు చేయాలని నిర్ణయించారు. దేవాదాయశాఖ మార్గదర్శకాలు వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

నదీమ తల్లికి నవహారతులు



నదీమ తల్లికి ఇస్తున్న నవహారతులు

విజయవాడ దుర్గా ఘాట్ కళకళలాడుతోంది. దసరా నుంచి కృష్ణమ్మకు నవ హారతులు ఇవ్వాలని అధికారులు ఘాట్‌లో ఏర్పాట్లు చేశారు. మంగళవారం రాత్రి నుంచే హారతుల ట్రయల్ రన్ కూడా ప్రారంభించారు. ఈ దసరా నుంచి రోజూ హారతులు ఇవ్వనున్నారు. గత తెదేపా ప్రభుత్వం 2014 నుంచి 2019 వరకు ఫెర్రీ ఘాట్‌లో పంచ హారతులు ఇవ్వగా.. వైకాపా ప్రభుత్వం దీన్ని అంతగా పట్టించుకోలేదు. దీంతో ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వం ఈ సంప్రదాయాన్ని నవ హారతులుగా ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించింది.

– ఈనాడు, అమరావతి

రైల్వే ప్రాజెక్టులపై రేపు కీలక సమావేశం

జోనల్ మేనేజర్‌తో ఎంపీల భేటీ

ఈనాడు, అమరావతి: దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో మన రాష్ట్రంలో ఉన్న విజయవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజన్ల పరిధిలోకి వచ్చే లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో..రైల్వే జోనల్ మేనేజర్ శుక్రవారం విజయవాడలో సమావేశం కానున్నారు. రాష్ట్రంలో చేపట్టాల్సిన రైల్వే లైన్ల నిర్మాణం, కొత్త ప్రాజెక్టులపై ఎంపీలు ఇచ్చే ప్రతిపాదనలపై ఈ సమావేశంలో చర్చిస్తారు. రాష్ట్రంలో కీలకమైన రైల్వే ప్రాజెక్టులు గత ఐదేళ్లలో పడకేశాయి. జగన్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులేవీ పూర్తికాలేదు. విశాఖ కేంద్రంగా మంజూరైన కొత్త జోన్ కార్యాలయాల నిర్మాణానికి భూములు అప్పగించలేక వైకాపా ప్రభుత్వం చేతులెత్తేసింది. రాజధాని అమరావతికి మంజూరైన కొత్తలైన్‌ను కూడా విస్మరించింది. ఇలా గత వైకాపా ప్రభుత్వంలో రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టుల పరంగా తీవ్ర నష్టమే జరిగింది. ఇప్పుడీ నష్టాన్ని పూరించుకొని, వేగంగా ప్రాజెక్టుల పనులు చేపట్టేలా చూసేందుకు.. కొత్తవి మంజూరు చేయించేందుకు ఈ సమావేశం కీలకం కానుంది.

మరిన్ని వివరాలు https://epaper.eenadu.net లో

మైలవరం టెక్స్‌టైల్స్ పార్కు పూర్తికి చర్యలు

- ఏడాదిలోగా సిద్ధం చేయాలని ప్రభుత్వ నిర్ణయం
- ఉత్పత్తి యూనిట్ల ఏర్పాటుకు ప్లాట్ల కేటాయింపు పూర్తి



వైఎస్సార్ జిల్లా మైలవరంలోని టెక్స్‌టైల్స్ పార్కు

ఈనాడు, అమరావతి: వైఎస్సార్ జిల్లా మైలవరంలో ఏళ్లుగా మూలకు చేరిన టెక్స్‌టైల్స్ పార్కు నిర్మాణాలను పూర్తి చేసేందుకు ఎన్డీయే ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఏడాదిలో పూర్తి చేసి ఉత్పత్తి ప్రారంభించేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. 2005-06 ఏడాదిలో టెక్స్‌టైల్స్ పార్కుకు 62.18 ఎకరాలు కేటాయించగా....కొద్ది మేర అప్పట్లో పనులు జరిగాయి. ఆ తర్వాత అటకెక్కింది. తాజాగా కొలువుదీరిన ఎన్డీయే ప్రభుత్వం మొదటి వంద రోజుల్లోనే పార్కు ఏర్పాటు పనుల్లో వేగం పెంచింది. ఇప్పటికే వివిధ రకాల ఉత్పత్తి యూనిట్ల ఏర్పాటుకుగాను 97 మందికి ప్లాట్ల కేటాయింపు కూడా పూర్తయింది.

10 వేల మందికి ఉపాధి: వైఎస్సార్ జిల్లాలో చేనేతలు అత్యధికంగా మైలవరం, జమ్మలమడుగు తదితర చుట్టు పక్కల ప్రాంతాల్లోనే ఉన్నారు. ఇక్కడ టెక్స్‌టైల్స్ పార్కు ఏర్పాటు చేయాలనేది చాలా కాలంగా ఉన్న డిమాండ్. ఈ పార్కు ఏర్పాటైతే 3 వేల మందికి ప్రత్యక్షంగా, మరో 7 వేల మందికి పరోక్షంగా ఉపాధి లభించనుంది. సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటు ద్వారా చేనేత కార్మికుల ఆదాయ వనరులు పెరగనున్నాయి. ఆ ప్రాంత రూపురేఖలు మారనున్నాయి. మొత్తం ఇక్కడ 118 యూనిట్లు ఏర్పాటుకానున్నాయి. ఇందులో చేనేత, పవర్‌లూమ్స్, డైయింగ్, గార్మెంట్స్, డ్రాయింగ్, స్టిచింగ్, సిల్క్ ట్విస్ట్ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చారు.

యూనిట్ల ఏర్పాటుకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు..: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో త్వరితగతిన టెక్స్‌టైల్స్ పార్కు ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ శివశంకర్ చర్యలు తీసుకుంటున్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఉత్పత్తి ఏర్పాట్లకుగాను ఒక్కొక్కరికి రూ.50 లక్షల చొప్పున రుణాలు అందించేందుకు బ్యాంకులతో సంప్రదింపులు పూర్తి చేశారు. ఇందులో లబ్ధిదారు వాటా రూ. 2.5 లక్షలుకాగా... ప్రభుత్వం రూ.17.5 లక్షల గ్రాంట్‌గా అందించనుంది. మిగతా మొత్తాన్ని రుణ వాయిదాల్లో బ్యాంకులకు చెల్లించాలి. రాష్ట్ర ప్రభుత్వం మీద ఆర్థిక భారం లేకుండా సెల్ఫ్ ఫైనాన్స్ ద్వారా పార్కు ఏర్పాటుకు కలెక్టర్ చర్యలు తీసుకుంటున్నారు.

రేపటి నుంచి అంతరిక్ష వారోత్సవాలు

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని షార్‌లో శుక్రవారం నుంచి ఈ నెల పదో తేదీ వరకు ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు డైరెక్టర్ రాజరాజన్ పేర్కొన్నారు. షార్ ఆధ్వర్యంలో మూడు రాష్ట్రాల్లో ఎనిమిది ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్రంలో శ్రీహరికోట (4, 10 తేదీల్లో), భీమవరంలో 6, 7 తేదీల్లో, నరసరావుపేట (7-9), నెల్లూరు(7-9), కడప(7-9), తమిళనాడులోని దిండిగల్(8, 9), ధర్మపురి(7-9), ఒడిశాలోని బర్గర్(4-6) తేదీల్లో వారోత్సవాలు నిర్వహిస్తామని చెప్పారు. ఇస్రో సీనియర్ శాస్త్రవేత్తలు ఉపన్యాసాలు ఇస్తారని, ప్రయోగాలు, ఉపగ్రహాల ప్రదర్శనలు, విద్యార్థులకు వివిధ పోటీలు ఉంటాయని ఆయన వివరించారు.

రేపు తిరుమలకు చంద్రబాబు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో మొదటిరోజు శుక్రవారం జరిగే ధ్వజారోహణంలో సీఎం చంద్రబాబు పాల్గొననున్నారు. ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఉండవల్లి నుంచి శుక్రవారం సాయంత్రం 4 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి విజయవాడలోని విమానాశ్రయం చేసుకుంటారు. అక్కడి నుంచి బయలుదేరి 5.10 గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకుంటారు. తిరుమలలోని పద్మావతి అతిథిగృహంలో కొంతసేపు విశ్రాంతి తీసుకుని రాత్రి 7.40 గంటలకు బేడి ఆంజనేయ స్వామిని దర్శించుకుంటారు. అనంతరం ప్రభుత్వం తరపున చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి.. శ్రీవారికి పట్టువస్త్రాలను సమర్పిస్తారు. అనంతరం మాడవీధుల్లో జరిగే పెద్దశేష వాహన సేవలో పాల్గొంటారు. రాత్రి 9.20 గంటలకు పద్మావతి అతిథిగృహం చేరుకుని రాత్రికి అక్కడే బసచేస్తారు. శనివారం ఉదయం 7.35 గంటలకు పాంచజన్యం వెనుక నూతనంగా నిర్మించిన వకుళ మాత నూతన కేంద్రీయ వంటశాలను ప్రారంభిస్తారు. అనంతరం తిరుపతి విమానాశ్రయం చేరుకుని అక్కడి నుంచి హైదరాబాద్ బయలుదేరి వెళతారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు



మాట్లాడుతున్న ఎండీ ఫరూఖ్ షుబ్లీ, వేదికపై అధికారులు, నాయకులు

మంగళగిరి, న్యూస్‌టుడే: విద్యతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫరూఖ్ షుబ్లీ అన్నారు. అంజుమన్ - యి - హిమాయితుల్ ఇస్లాం ఆధ్వర్యాన ఈద్గా కమ్యూనిటీ సమావేశ మందిరంలో పేద ముస్లిం విద్యార్థినీ విద్యార్థులకు ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఇస్లామిక్ ఫ్రంట్ అధ్యక్షుడు షేక్ రియాజ్ అధ్యక్షత వహించారు. కష్టపడి చదివి పది మందికి సేవచేసే స్థాయికి ప్రతి ఒక్కరూ ఎదగాలని సూచించారు. ఎన్నికల సమయంలో యువ నేత నారా లోకేశ్ ఇచ్చిన హామీ అమలు చేసేందుకు నాలుగు శాతం రిజర్వేషన్లు అమలుకు కట్టుబడి ఉన్నట్లు ప్రకటించి మైనార్టీ వర్గాలకు భరోసా కల్పించి అండగా నిలబడ్డారన్నారు. అనంతరం 650మంది పేద ముస్లిం విద్యార్థినీ విద్యార్థులకు రూ.6 లక్షల ఉపకార వేతనాలను అందజేశారు. ఇస్లామిక్ ఫ్రంట్ కన్వీనర్ షేక్ అక్రమ్, నగరపాలక కమిషనర్ అలీం బాషా, ముస్లిం యువతరం కన్వీనర్ ఎండీ ఇక్బాల్ అహ్మద్, కిద్మత్ బ్యాంక్ డైరెక్టర్ శిలారుబాబు, తెదేపా పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, అంజుమన్ అధ్యక్ష కార్యదర్శులు షేక్ అల్తాఫ్, షేక్ అనీఫ్‌షా పాల్గొన్నారు.



దసరా ఉత్సవాల్లో ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాతను దర్శించుకునేందుకు దేశ నలుమూలల నుంచి భక్తులు వేల సంఖ్యలో విచ్చేస్తుంటారు. శరన్నవరాత్రుల్లో దుర్గమ్మ తల్లిని దర్శించుకుంటే జీవితం తరిస్తుందని భావిస్తారు. అదే సమయంలో ఉత్సవాల్లో అమ్మవారి అలంకారాలు కూడా ప్రత్యేకతను సంతరించుకుంటాయి. ఇందుకోసం భక్తులు కానుకగా ఇచ్చిన ఆభరణాలతోపాటు సంప్రదాయంగా వస్తున్న వాటిని లోకాలను ఏలే తల్లికి అలంకరిస్తారు. ఆ అలంకారాల్లో ఏ ఆభరణాలు వినియోగిస్తారో తెలుసుకోవాలనే ఆసక్తి భక్తుల్లో ఉంటుంది. **బాలాత్రిపుర సుందరీదేవి**: అభయహస్తాలు, బంగారు పూలజడ, కంఠాభరణాలు, బంగారు వడ్డాణం. **గాయత్రీదేవి:** స్వర్ణ పంచముఖాలు, బంగారు అభయ హస్తాలు, పచ్చల హారం, కంఠాభరణాలు. **అన్నపూర్ణాదేవి :** స్వర్ణ పాత్ర, బంగారు త్రిశూలం, హస్తాలు. **లలితా త్రిపుర సుందరీదేవి :** స్వర్ణ కిరీటం, కంఠాభరణాలు, స్వర్ణాభరణాలు, అభయహస్తాలతో అలంకరిస్తారు. **మహాచండీ దేవి :** సింహవాహనం, కంఠాభరణాలు, ఖడ్గం, కర్ణాభరణాలు, హస్తాలు. **మహాలక్ష్మీదేవి :** గజరాజు, అభయ హస్తాలు, ధనరాశులు, వడ్డాణం, కంఠాభరణాలు, కర్ణాభరణాలు. **సరస్వతీదేవి :** బంగారు వీణ, స్వర్ణహస్తాలు, పగడాల హారం, వడ్డాణంతో అలంకరిస్తారు. **దుర్గాదేవి :** శార్దూల వాహనం, బంగారు త్రిశూలం, సూర్యచంద్రులు, శంకుచక్రాలు. **మహిషాసుర మర్దినిదేవి :** సింహ వాహనం, బంగారు త్రిశూలం, స్వర్ణ ఖడ్గం, కంఠాభరణాలు, కర్ణాభరణాలు. **రాజరాజేశ్వరిదేవి :** స్వర్ణాభరణాలు, అభయహస్తాలు, చెరకుగడతో అలంకరిస్తారు. కాసుల పేరు, బంగారు పూలజడ, దేవిపాదాలు అమ్మవారి రూపాన్ని అనుసరించి వినియోగిస్తారు.

- న్యూస్‌టుడే, ఇంద్రకీలాద్రి

నేటి అలంకారం

3-10-2024, గురువారం

శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి



" అరుణకిరణ జాలై రంజితా సావకాశా
విధృత జపతటీకా పుస్తకా భీతిహాసా
ఇతర వరకారాధ్య పుల్లకల్హారసంస్థా
నివసతు హృదిబాలా నిత్యకళ్యాణశీలా"

దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల్లో మొదటి రోజు జగన్మాత దుర్గాదేవి బాలాత్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను ఆవహించి ఉండే శక్తి స్వరూపమే త్రిపుర అని త్రిపురతాపినీ ఉపనిషత్తు చెబుతోంది. 'స్వర్గ, భూ, పాతాళం' అనే త్రిపురాల్లో ఉండే శక్తి చైతన్యాన్ని త్రిపురగా వర్ణిస్తారు. శ్రీచక్రంలో ఉండే తొమ్మిది అమ్నాయాల్లో మొదటి అమ్నాయం త్రిపురసుందరీదేవియే. 'శ్రీ' విద్యలో మొదటి విద్య బాల అందుకే ఆధ్యాత్మిక విద్యను సాధన చేసేవారు మొదట బాల మంత్రాన్ని ఉపాసన చేయడం జరుగుతుంది. త్రిపుర సుందరీ దేవి అభయహస్తముద్రతో చేతిలో అక్షరమాల ధరించి ఉంటుంది. మనసు, బుద్ధి, అహంకారం ఆమె ఆధీనంలో ఉంటాయి. ఆమెను ధ్యానించడంతో సమస్త మనోవికారాలు తొలగి నిత్యసంతోషం కలుగుతుందని భక్తుల నమ్మకం. బాలాత్రిపుర సుందరీ దేవిని అరుణవర్ణ వస్త్రాలు ధరించి ఎర్రని పూలతో పూజ చేసి కట్టెపొంగలిని నైవేద్యంగా సమర్పిస్తారు.

విలువలతో కూడిన చదువు అవసరం

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: నేటి విద్యా విధానంలో విలువలతో కూడిన విద్య అవసరమని ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఎస్పీ కేజీవీ సరిత అన్నారు. మానవత ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా భాష్యం విద్యాసంస్థల ఆడిటోరియంలో బుధవారం ఏర్పాటు చేసిన సభలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థుల్లో మానవతా విలువలు, పోటీతత్వం, సానుకూల దృక్పథాలను చిన్న వయసు నుంచి నేర్పాలని సూచించారు. మన యువతను సరైన మార్గంలో నడిపించడంలో విఫలమయ్యామని సరిత పేర్కొన్నారు. నేర పరిశోధన విభాగ డీఎస్పీ గోలి లక్ష్మయ్య మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత నేటి సమాజంపై ఉందన్నారు. జనచైతన్య వేదిక అధ్యక్షుడు లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ రూ.60 వేలు విలువ చేసే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ మెటీరియల్‌తో కూడిన 200 పుస్తకాలు విద్యార్థులకు అందించడం హర్షణీయమన్నారు. మానవత ఛైర్మన్ రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ 2004 ప్రారంభమై నేడు 125 శాఖలకు విస్తరించి 75 వేలమంది సభ్యులతో సమాజ సేవలో భాగస్వామ్యం అయ్యిందన్నారు. నగరంలో విశిష్ట సేవలు అందించిన సంస్థల సభ్యులను సత్కరించారు. బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ కార్యదర్శి నాగేశ్వరరావు, మానవత అధ్యక్షులు శ్రీనివాసరావు, కార్యదర్శి సతీష్, కోశాధికారి సాయిరాం తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఎస్పీ సరిత, పక్కన డీఎస్పీ గోలి లక్ష్మయ్య, లక్ష్మణరెడ్డి తదితరులు

గాంధీ బాటలో పయనిద్దాం

పారిశుద్ధ్య కార్మికురాలికి ప్రశంసాపత్రం అందజేస్తున్న పెమ్మసాని, మాధవి, నసీర్, తదితరులు



హిమని కూడలిలో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



మహాత్ముడి మార్గం అనుసరణీయం

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: సత్యం, అహింస ఆయుధాలుగా చేసుకుని స్వాతంత్ర్య ఉద్యమంలో అలుపెరుగని పోరాటం చేసిన గొప్ప మహనీయుడు మహాత్మా గాంధీ అని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి కొనియాడారు. కలెక్టరేట్‌లోని లుంబిని వనంలో ఉన్న గాంధీ విగ్రహానికి బుధవారం నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ గాంధీ జయంతిని దేశమంతా ఆయన త్యాగాలను మననం చేసుకుంటూ నిర్వహించుకుంటున్నామన్నారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రతకు ఆయన ఎంతో ప్రాధాన్యం ఇచ్చారన్నారు. గాంధీ సందేశాన్ని ఆచరిస్తూ జిల్లాలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలను సెప్టెంబర్ 17 నుంచి గాంధీ జయంతి వరకు నిర్వహించామన్నారు. పారిశుద్ధ్యం అనేది నిరంతర ప్రక్రియ అని, ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములై జిల్లాను స్వచ్ఛ జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, డీఆర్వో పి.రోజా, సహాయ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ఆర్డీవో కె.శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పించిన కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవ్ తేజ తదితరులు